మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 166 వెల - రూ 5:00

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnag Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yad



## పూజా ఖేడ్కర్‌కు ఉపశమనం

### అరెస్ట్ చేయకుండా స్టే విధించిన ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు):
నకిలీ ధృవపత్రాలతో ఐఏఎస్ ఉద్యోగం పొందిందన్న ఆరోపణ ఎదుర్కొంటున్న పూజా ఖేడ్కర్ కు ఢిల్లీ హైకోర్టు నుంచి ఉపశమనం లభించింది. ఆమె అరెస్టుపై స్టే ఇచ్చింది. సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో నకిలీ ధృవపత్రాలతో ఉత్తీర్ణత సాధించిందన్న ఆరోపణపై ఢిల్లీ పోలీసులు ఆమెపై కేసు నమోదు చేశారు. కాగా ముందస్తు బెయిలు కోరుతూ పూజా ఖేడ్కర్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. ఆమె అరెస్టుపై ఆగస్టు 21 వరకు స్టే ఇచ్చింది కోర్టు. అంతేకాక ఊరట ఇవ్వడాన్ని నిరాకరించిన ట్రయల్ కోర్టు తీర్పును తప్పుపట్టింది. ఇదివరలో పూజా ఖేడ్కర్ బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా ఆ పిటిషన్ ను పటియాలా హౌజ్ కోర్టు కొట్టివేసింది. దాంతో ఆమె హైకోర్టును ఆశ్రయించారు.



కవితకు మధ్యంతర బెయిల్‌కు

## సుప్రీం నో..

- ఇచ్చేందుకు ధర్మాసనం నిరాకరణ
- ఈడీ, సీబీఐకి సుప్రీంకోర్టు నోటీసులు జారీ
- విచారణ ఆగస్ట్ 20కి వాయిదా వేసిన ధర్మాసనం

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు):
సుప్రీంకోర్టులో కవితకు ఊరట దక్కలేదు. ఆమెకు మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు మిగతా 2లో..



## సుప్రీంకు కేజ్రీవాల్

- మనీలాండరింగ్ కేసులో విడుదల చేయాలని పటిషన్

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు):
దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సుప్రీంకోర్టును ఆశ్ర యించారు. మనీలాండరింగ్ కేసులో అరెస్టైన మిగతా 2లో..


# మెగా కార్ టెస్టు సెంటర్

## తెలంగాణకు తరలివస్తున్న పెట్టుబడులు

- తెలంగాణలో హ్యుందాయ్ మెగా కారు టెస్ట్ సెంటర్
- హైదరాబాద్ లోని ఇంజినీరింగ్ సెంటర్ ఆధునీకరణ
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో హెచ్ఎంఐఈ ప్రతినిధుల భేటి
- సియోల్‌లో ఎల్ఎస్ గ్రూప్ ఛైర్మన్‌తోనూ సీఎం భేటీ
- వరంగల్ టెక్స్‌టైల్ పార్కులో పెట్టుబడులపై కొరియన్ కంపెనీల ఆసక్తి
- ముఖ్యమంత్రి పిలుపునకు కొరియన్ జౌళి పరిశ్రమ సమాఖ్య సానుకూలత
- సీఎం రేవంత్ అమెరికా పర్యటన విజయవంతం
- తెలంగాణలో రూ.31,532 కోట్ల పెట్టుబడులతో ముందుకొచ్చిన 19 కంపెనీల ప్రతినిధులు



సియోల్ (ప్రజా మంటలు):
దక్షిణ కొరియా ఆటోమోటివ్ దిగ్గజం హ్యుందాయ్ మోటార్ కంపెనీ దాని భారతీయ విభాగమైన హ్యుందాయ్ మోటార్ ఇండియా ఇంజినీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా తెలంగాణలో కారు మెగా టెస్ట్ సెంటర్‌ను స్థాపించాలని యోచిస్తోంది. మెగా టెస్ట్ సెంటర్‌లో ఆటోమేటివ్ టెస్ట్ ట్రాక్ సదుపాయంతో పాటు అత్యాధునిక టెస్ట్ కార్ల తయారీ సౌకర్యం ఉంటుంది. అలాగే హైదరాబాద్‌లో ఉన్న ఇంజినీరింగ్ కేంద్రం పునరుద్ధరణ, ఆధునీకరణ, విస్తరణ ద్వారా ఊఓఎఇ భారతదేశం సహా ఆసియా పసిఫిక్ ప్రాంతంలో మరింత ఉపాధిని కల్పించనుంది. తెలంగాణకు పెట్టుబడుల సాధనే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని దక్షిణ కొరియాలో పర్యటిస్తోంది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు సియోల్‌లో హ్యుందాయ్ మోటార్ కంపెనీ అధికారులతో సోమవారం సమావేశమయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబుతో చర్చల అనంతరం ఊఓఎఇ ప్రతినిధులు మాట్లాడుతూ భారతదేశం తమకు చాలా ముఖ్యమైన మార్కెట్ అని, భారతీయ వినియోగదారుల కోసం బెంచ్‌మార్క్ సెట్టింగ్ ఉత్పత్తులు, సాంకేతికత అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని తెలిపారు. అత్యాధునిక పరీక్షా సౌకర్యాల అభివృద్ధి చేసేందుకు తమకు అవకాశం కల్పించిన మిగతా 2లో..



## వినేశ్ ఫోగట్‌కు న్యాయం జరిగేనా..!

- ఆమె అప్పీల్‌పై నేడు తీర్పు వెలువరించనున్న 'కాస్'
- వినేశ్ ఉదంతంతో బరువు కొలిచే నియమాల్లో మార్పులు!

పారిస్ ఒలింపిక్స్‌లో భారత రెజ్లర్ వినేశ్ ఫొగాట్‌పై అనర్హత వేటు వేయడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఫైనల్‌కు చేరిన తర్వాత 100 గ్రాముల అదనపు బరువు ఉందని ఆమెపై అనర్హత వేటు వేస్తున్నట్లు ప్రకటించారు. ఈ నిర్ణయాన్ని ఇతర దేశాల రెజ్లర్లు సైతం వ్యతిరేకించారు. 50 కేజీల విభాగంలో పోటీపడి 100 గ్రాముల అదనపు బరువుతో అనర్హతకు గురైె వినేశ్ ఫొగాట్ న్యాయపోరాటం చేస్తోంది. అనర్హతను సవాలు చేస్తూ కోర్టు ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్‌ను ఆశ్రయించింది. ఆమె అప్పీల్‌ను విచారణకు స్వీకరించిన కాస్ మంగళవారం సాయంత్రం ఆరు గంటల్లోగా తుది తీర్పును వెల్లడించనుంది. కాగా ప్రపంచ రెజ్లింగ్ గవర్నింగ్ బాడీ, యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇక నుంచి రెజ్లర్ల బరువు కొలిచే నియమ నిబంధనల్లో మార్పులు చేయాలని యోచిస్తున్నట్టు సమాచారం. అయితే, ఈ మార్పులు పూర్తిస్థాయిలో మిగతా 2లో..

## వైద్యురాలిపై హత్యాచార ఘటన..

### ఆదివారం నాటికి పూర్తికాకపోతే కేసు సీబీఐకి..

- పోలీసులకు మమత డెడ్‌లైన్



కోల్‌కతా (ప్రజా మంటలు):
జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటన పశ్చిమ బెంగాల్ రాజకీయాలను కుదిపేస్తోంది. నిందితుడికి కఠినంగా శిక్ష పడాలంటూ వైద్యులు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తంచేశారు. ఈ క్రమంలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పోలీసులకు అల్టిమేటం ఇచ్చారు. వారం రోజుల్లో కేసును పరిష్కరించలేకపోతే సీబీఐకి అప్పగిస్తామన్నారు. ఈ ఘటనపై ప్రతిపక్ష భాజపా నుంచి తీవ్ర విమర్శలు ఎదురవుతున్న వేళ పోలీసులు దీదీ ఈ డెడ్‌లైన్ విధించారు. సీఎం మమతా బెనర్జీ సోమవారం మృతురాలి నివాసానికి వెళ్లి బాధిత మిగతా 2లో..

## పొలిట్రిక్స్

పోటీలో ఇంటింటికి
దండాలతో వత్తాసు ,
గెలిచాక అమ్మతోడు
కనిపిస్తే ఒట్టు బాసు !

అన్ని తెలిసి ప్రజలేమో
ఓటేసుడు ఎందుకోయ్
లేకపోతే పథకాలు
దక్కవని భయానికోయ్ !

- న్యాలకంటి నారాయణ
9346200066

# ప్రపంచపటంలో 'తెలంగాణ పర్యాటకం'



- బౌద్ధ మహాస్తూపాన్ని అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దుతాం
- భక్త రామదాసు జన్మస్థలం, పాలేరు రిజర్వాయర్
- మూడింటినీ పర్యాటక కేంద్రాలుగా మారుస్తాం
- డీపీఆర్ సిద్ధం చేయాలని అధికారులకు డిప్యూటీ సీఎం ఆదేశం
- నేలకొండపల్లిలో మంత్రులు పొంగులేటి, జూపల్లితో కలిసి పర్యటన

ఖమ్మం (ప్రజా మంటలు):
నేలకొండపల్లిలోని బౌద్ధ స్థూపం ఒకటో శతాబ్దం నాటిదని, 8 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ స్థూపం దక్షిణ భారత దేశంలోనే పెద్దదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం ఆయన మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ఎంపీ రఘురామిరెడ్డితో కలిసి బౌద్ధస్థూపాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ బుద్ధిస్ట్ మ్యూజియం ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్టు చెప్పారు. అండర్ గ్రౌండ్లో ఆనాటికి సంబంధించిన శిలలు ఉన్నాయన్నారు. బౌద్ధ స్థూపాన్ని ఇండియాలనే ది బెస్ట్ గా తీర్చిదిద్దుతామని తెలిపారు. అభివృద్ధి కి కావలసిన నిధులు మంజూరు చేస్తామని అన్నారు. ఇందుకోసం


## నాలాల ఆక్రమణలపై ఉక్కుపాదం

- గొలుసుకుట్టు చెరువులను రక్షిస్తాం
- చెరువు అడుగుల్లో భూములు కొనొద్దు
- హైడ్రా కమిషనర్ రంగనాథ్ హెచ్చరిక



హైదరాబాద్, (ప్రజా మంటలు):
హైదరాబాద్(జనంసాక్షి): నగరంలో ఆక్రమణలకు సంబంధించి ప్రజల నుంచి వందల సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నాయని హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) కమిషనర్ రంగనాథ్ తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దశలవారీగా హైడ్రా పనిచేస్తుందని చెప్పారు. మొదటి దశలో ఆక్రమణలను అడ్డుకుంటామన్నారు. రెండో దశలో ఆక్రమించి నిర్మించిన భవనాలపై చర్యలు, అనుమతుల నిరాకరణ ఉంటుందని తెలిపారు. మూడో దశలో చెరువుల పూడిక తీసి వాన నీటిని మళ్లించి పునరుజ్జీవం కల్పిస్తామన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో చెరువులు, కుంటలు కలిపి 400కు పైగా ఉన్నాయన్నారు. ఎన్ఆర్ఎస్సీ నివేదిక ప్రకారం 44 ఏళ్లలో చాలా చెరువులు కనుమరుగయ్యాయని చెప్పారు. చాలా చెరువులు 60 శాతం, కొన్ని చెరువులు 80 శాతం ఆక్రమణలకు గురయ్యాయని తెలిపారు. చెరువుల పరిధిలోని ఆక్రమణలను గుర్తిస్తున్నట్లు పేర్కొన్నారు. వీటిని అడ్డుకోకపోతే హైదరాబాద్ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మిగతా 2లో..

## ప్రజా నాడి




## బీఆర్ఎస్ చేజారిన నకిరేకల్ మున్సిపాలిటీ

నల్లగొండ (ప్రజా మంటలు):
నకిరేకల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి మరో షాక్ తగిలింది. మున్సిపల్ పీఠంపై కాంగ్రెస్ పాగ వేసింది. నకిరేకల్ మున్సిపల్ ఛైర్మన్ రాచకొండ శ్రీనివాస్ గౌడ్ పై అవిశ్వాస తీర్మానం పెట్టారు. మొత్తం 20 మంది కౌన్సిలర్లు ఉండగా.. వారిలో 16 మంది అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా నిలిచారు. మిగిలిన నలుగురు సభ్యులు ఈ అవిశ్వాస తీర్మానానికి హాజరు కాలేదు. దీంతో అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో నకరేకల్ మున్సిపల్ ఛైర్మన్ పీఠాన్ని బీఆర్ఎస్ కోల్పోయింది. దీంతో నకిరేకల్ మున్సిపల్ పీఠం హస్తం పార్టీకి దక్కుతుంది. ఎమ్మెల్యే వేముల వీరేశం అవిశ్వాసంలో చక్రం తిప్పాడు. త్వరలోనే నకలిరేకల్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ నుంచి కొత్త ఛైర్మన్ ఎన్నిక కానుంది.

# హిండెన్ బర్గ్ విడుదల నివేదికపై జేపీసీ విచారణ

### - విపక్ష నేత రాహుల్ గాంధీ డిమాండ్

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు):
సెబీ చీఫ్ మాధబి పురి బచ్, ఆమె భర్త వాటాలు కొనుగోలు చేశారంటూ హిండెన్ బర్గ్ విడుదల చేసిన నివేదికపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జెపిసి)తో దర్యాప్తు చేపట్టాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. చిన్న రిటైల్ వ్యాపారుల సంపదకు భద్రత కల్పించే బాధ్యతను అప్పగించిన సెక్యూరిటీస్ రెగ్యులేటర్ అయిన సెబీ సమగ్రత ఆ సంస్థ ఛైర్‌పర్సన్‌పై వచ్చిన ఆరోపణలతో తీవ్రంగా రాజీపడిందని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ వ్యాఖ్యానించారు. ఆమె వాటాలు కొనుగోలు చేసినట్లు వెల్లడైందని, కానీ ఇప్పటికీ ఆమె రాజీనామా చేయకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందని వీడియో ప్రకటనలో పేర్కొన్నారు. కొత్త ఆరోపణలు వెలుగుచూడటంతో ఈ అంశాన్ని సుప్రీంకోర్టు సుమోటోగా



స్వీకరిస్తోందా? అని ప్రశ్నించారు. అదానీ గ్రూప్‌పై హిండెన్ బర్గ్ నివేదికతో లక్షలాది మంది భారతీయుల పొదుపులు ప్రమాదంలో ఉన్నాయని.. ఈ అంశంపై విచారణ చేపట్టాల్సిందేనని డిమాండ్ చేశారు. ఒకవేళ ఆరోపణలు వాస్తవమై? వ్యాపారులు కష్టపడి దాచుకున్న సంపద పోగొట్టుకుంటే ప్రధాన మంత్రా లేదా సెబీ చీఫ్ లేదా అదానీ ఎవరు బాధ్యత వహిస్తారు? అని ప్రశ్నించారు. ఈ అంశంలో జెపిసి విచారణకు ప్రధాని ఎందుకు వెనకడుగు వేస్తున్నారో స్పష్టమౌతోందని అన్నారు. స్టాక్ మార్కెట్‌లో చిన్న, మధ్యతరగతి పెట్టుబడిదారు లకు భద్రత కల్పించాలంటే జెపిసి విచారణ తప్పనిసరి అని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే పేర్కొన్నారు. భారత రాజ్యాంగ విలువలను పక్కన పెట్టి తన మిత్రులను కాపాడుకునేందుకు ప్రధాని యత్నిస్తుంటారని ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు. తమ మిత్రులైన కార్పోరేట్ల అవినీతి విధానాలను రక్షించేందుకు, కేవలం కార్పోరేట్ ప్రయోజనాలను కాపాడేందుకు మాత్రమే బిజెపి పనిచేస్తోందని సిపిఐ(ఎం) ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి, సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా పేర్కొన్నారు. జెపిసి విచారణ చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. జెపిసి విచారణ చేపట్టాల్సిందేనని సమాజ్ వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ డిమాండ్ చేశారు. మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి

# మెగా కార్ టెస్టు సెంటర్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు హెచ్ఎంఐఈ ప్రతినిధులు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ దిగ్గజ కంపెనీల నుంచి పెట్టుబడులను తెలంగాణలో పెట్టించేందుకు తమ ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. హ్యుందాయ్ మోటార్ కంపెనీ తన అనుబంధ సంస్థ హెచ్ఎంఐఈ ద్వారా తెలంగాణలో కార్ టెస్టింగ్ సదుపాయం నెలకొల్పేందుకు పెట్టుబడులు పెట్టాలని ప్రణాళిక రచిస్తోందన్నారు. రాష్ట్రం అనుసరిస్తున్న పారిశ్రామిక స్నేహపూర్వక విధానాలు, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాల ఏర్పాటు, ఆటంకాలు లేని అనుమతుల వ్యవస్థతో ప్రగతిశీల, భవిష్యత్ ను దృష్టిలో ఉంచుకొని తెలంగాణలో వ్యాపారం చేసేందుకు హెచ్ఎంఐఈ వంటి అత్యుత్తమ-తరగతి కంపెనీలు ముందుకు వస్తున్నాయని తెలిపారు. హెచ్ఎంఐఈ మెగా టెస్ట్ సెంటర్ సమీపంలోని సౌకర్యాలు ఇతర అనుబంధ సంస్థలు, సరఫరాదారులను ఆకర్షించే అవకాశం ఉంది. ఇది ప్రత్యక్షంగా, పరోక్షంగానూ భారీగా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు దోహదపడుతుంది.

**ఎల్ఎస్ గ్రూప్ ఛైర్మన్‌తో భేటీ**

అమెరికా పర్యటన ముగించుకుని పెట్టుబడులను ఆకర్షించేందుకు దక్షిణ కొరియాలోని సియోల్ చేరుకున్న ఆయన.. వివిధ సంస్థల ప్రతినిధులతో సమావేశమవుతున్నారు..ఇందులో భాగంగా ఆయన ఎల్ఎస్ (ఎల్‌జీ) గ్రూప్ ఛైర్మన్‌తో భేటీ అయ్యారు. రాష్ట్రంలో విద్యుత్ కేబుల్, గ్యాస్, ఇంధన, బ్యాటరీల ఉత్పత్తిలో పెట్టుబడులపై



చర్చించారు. త్వరలో తెలంగాణలో పర్యటించేందుకు ఎల్ఎస్ గ్రూప్ బృందం అంగీకరించింది. మరోవైపు కొరియా టెక్స్‌టైల్ పరిశ్రమ సమాఖ్యతో సీఎం రేవంత్‌రెడ్డి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వరంగల్ మెగా టెక్స్‌టైల్ పార్కుకు కొరియా పెట్టుబడులు వస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.మరోవైపు ఎనిమిది రోజుల పాటు అమెరికాలో సీఎం జరిపిన పర్యటన విజయవంతమైందని తెలంగాణ ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. సీఎం నిర్వహించిన సమీక్ష సమావేశాల ఫలితంగా.. 19 కంపెనీల ప్రతినిధులు తెలంగాణలో రూ.31,532 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చినట్లు పేర్కొంది. రాష్ట్ర ప్రతినిధి బృందం అమెరికాలో దాదాపు 50కి పైగా వాణిజ్య సంస్థలతో సమావేశమైందని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఫార్మా, లైఫ్ సైన్సెస్, విద్యుత్ వాహనాలు, డేటా సెంటర్లు, ఐటీ, ఎలక్ట్రానిక్ రంగాల్లో పెట్టుబడులు పెట్టే దిశగా పలు సంస్థలు సంసిద్ధత వ్యక్తం చేశాయని తెలిపింది.

# ప్రపంచపటంలో 'తెలంగాణ పర్యాటకం'

డీపీఆర్ సిద్ధం చేయాలని డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు. నేలకొండ పల్లికి మరో ప్రత్యేకత ఉందని, భక్తరామదాసు జన్మస్థలమని దానిని మరింత అభివృద్ధి చేస్తామని, కాంగ్రెస్ హయాంలో నిర్మించిన పాలేరు రిజర్వాయర్ కూడా ప్రత్యేకత అని ఈ మూడింటిని అభివృద్ధి చేయడం ద్వారా పర్యాటకులను విశేషంగా ఆకర్షించవచ్చన్నారు. తమ ప్రభుత్వం పర్యాటక రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు. ఇప్పటికే అంతర్జాతీయ స్థాయి పర్యటకులను నేలకొండపల్లి ఆకర్షిస్తోందని, ఇంకా ఎక్కువ మంది ఈ కేంద్రాలను సందర్శించేలా వసతులు మెరుగుపరచాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

## కవితకు మధ్యంతర బెయిల్‌కు సుప్రీం నో..

సుప్రీం తిరస్కరించింది. ఆమె బెయిల్ పిటిషన్‌పై సోమవారం విచారణ జరిగింది. కవిత పిటిషన్‌పై సుప్రీంకోర్టు పెద్ద ట్విస్ట్ ఇచ్చింది. ఈడీ, సీబీఐకి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. స్పందన తెలియజేయాలని కేంద్ర ఏజెన్సీలను కోర్టు కోరింది. తదుపరి విచారణను ఆగస్టు 20కి వాయిదా వేసింది. మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు సుప్రీం ధర్మాసనం నిరాకరించింది. ఈ కేసుపై జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ విశ్వనాథ్ ధర్మాసనం విచారణ జరిపింది.సీబీఐ, ఈడీ కేసులలో బెయిల్ ఇవ్వాలని కవిత పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఢిల్లీ హైకోర్టు తీర్పును కవిత సవాల్ చేశారు. మార్చి 15న కవితను ఈడీ అరెస్టు చేయగా.. ఏప్రిల్ 11న సీబీఐ అరెస్ట్ చేసింది. ఇక కవిత తరుపున న్యాయవాది ముకుల్ రోహత్గి వాదనలు వినిపించారు. 5 నెలల నుంచి ఆమె జైల్లో ఉన్నారు. 463 మంది సాక్షులను విచారించామని ధర్మాసనం పేర్కొంది. కాగా ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయి తిహార్ జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత బెయిల్‌పై ఆశలు పెట్టుకున్నారు. ఇప్పటికే కవితకు ట్రయల్ కోర్టు, ఢిల్లీ హై కోర్టు బెయిల్ నిరాకరించాయి. దీంతో ఆమె ఆశలన్నీ సుప్రీంకోర్టు పైనే పెట్టుకున్నారు. ఇవాళ తనకు బెయిల్ వస్తుందని ఆమె భావించినట్టు సమాచారం. తనపై ఈడీ, సీబీఐలు నమోదు చేసిన కేసుల్లో బెయిల్ ఇవ్వాలని కోరుతూ కవిత ఈ నెల 8న సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తనకు బెయిల్ ఇవ్వడానికి నిరాకరిస్తూ ఢిల్లీ హైకోర్టు జూలై 1న ఇచ్చిన తీర్పును సవాల్ చేశారు. సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్(క్రిమినల్) దాఖలు చేశారు. అక్కడ కూడా వాయిదా పడింది. ఇక బెయిల్ కోసం మరో వారం పాటు కవిత వేచిచూ?డాల్సిన పరిస్థితి నెలకొంది. అప్పుడైనా బెయిల్ వస్తుందో రాదో వేచిచూడాల్సి ఉంది.ప్రస్తుతం కవిత తీహార్ జైల్లో ఉన్నారు. ఆమెను బయటకు తీసుకొచ్చేందుకు ఆమె కుటుంబం తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలోనే ఆమె సోదరుడు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు ఇటీవలే ఢిల్లీకి వెళ్లారు. ఆ సమయంలో వారిద్దరూ కవితకు బెయిల్ అంశంపై చర్చించారని జోరుగా ప్రచారం సాగింది. ఎన్నో ఆశలు పెట్టుకున్నప్పటికీ కోర్టులో నిరాశే ఎదురవ్వడం గమనార్హం.ఢిల్లీ హైకోర్టులో ఢిల్లీ మద్యం పాలసీ కేసులో దర్యాప్తు సంస్థలు దాఖలు చేసిన చార్జ్‌షీట్‌లో 50 మందిని నిందితులుగా పేర్కొన్నాయని... అందులో కవిత మాత్రమే మహిళ అని ఆమె తరుఫు సీనియర్ న్యాయవాదులు గతంలో ఢిల్లీ హైకోర్టులో వాదించారు. మహిళలకు కొన్ని ప్రత్యేక వెసులుబాట్లను చట్టాలు కల్పించాయని తెలిపారు. వాటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని కవితకు బెయిల్ ఇవ్వాలన్నారు. ఈ నేపథ్యంలో దర్యాప్తు సంస్థల తీరును ఆమె తరుఫు న్యాయవాది తప్పుబట్టారు. కవిత విషయంలో దర్యాప్తు సంస్థలు మొదటి నుంచీ చట్టాలను ఉల్లంఘిస్తూనే ఉన్నాయని.. అరెస్టు సమయంలో కనీస నిబంధనలు పాటించలేదని.. మహిళలకు ప్రత్యేక రక్షణలు ఉన్నాయని వాటి కింద కవితకు బెయిల్ ఇవ్వాలని కవిత తరఫున సీనియర్ న్యాయవాదులు వినిపించిన వాదనలను హైకోర్టు పరిగణనలోకి తీసుకోలేదు.

## సుప్రీంకు కేజ్రీవాల్ - మనీలాండరింగ్ కేసులో విడుదల చేయాలని పటిషన్

తనను విడుదల చేయాలని సోమవారం అత్యున్నత న్యాయస్థానాన్ని కోరారు.ఎక్సైజ్ కేసులో సీబీఐ తనను అరెస్టు చేయడాన్ని సవాల్ చేస్తూ పిటిషన్ దాఖలు చేశారు. తన అరెస్టు, రిమాండ్‌పై జూన్‌లో దిల్లీ కోర్టు జారీ చేసిన ఉత్తర్వులు చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పునకు ఇది వ్యతిరేకంగా ఉందని పిటిషన్‌లో వెల్లడించారు. దీనిపై అత్యవసర విచారణ జరపాలని కేజ్రీవాల్ తరపు న్యాయవాది సుప్రీంను కోరగా తమకు మెయిల్ అభ్యర్థన పంపాలని భారత ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ తెలిపారు.మద్యం కుంభకోణం కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై మార్చి 21న కేజ్రీవాల్‌ను ఈడీ అధికారులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. తన అరెస్టును సవాల్ చేస్తూ కేజ్రీవాల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దానిపై విచారణ ఆలస్యమవుతుండటంతో ఎన్నికల్లో ప్రచారం కోసం చేసిన అభ్యర్థనను అంగీకరిస్తూ.. కోర్టు షరతులతో కూడిన మధ్యంతర బెయిల్ ఇచ్చింది. ఎన్నికల అనంతరం ఆయన తిరిగి జైలుకు వెళ్లారు. కాగా ఈడీ అరెస్టు కేసులో సుప్రీం సీఎంకు జులై 12న మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అయితే ఇదే కేసులో సీబీఐ ఆయనను అరెస్టు చేయడంతో ప్రస్తుతం జైల్లోనే కొనసాగుతున్నారు.ఇదే కేసులో మొదట అరెస్టయిన దిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోదియాకు ఆగస్టు 9న సుప్రీం బెయిల్ మంజూరు చేసింది. కాగా రాజ్యసభ సభ్యుడు సంజయ్ సింగ్‌కు ఆరు నెలల కస్టడీ తర్వాత ఏప్రిల్‌లో అత్యున్నత న్యాయస్థానం బెయిల్ ఇచ్చింది.

## హిండెన్ బర్గ్ విడుదల నివేదికపై జేపీసీ విచారణ

హిండెన్‌బర్గ్ ఆరోపణలతో నష్టాల్లోకి అదానీ గ్రూప్ స్టాక్స్

అమెరికా షార్ట్ సెల్లర్ సంస్థ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ తాజా ఆరోపణలు మరోసారి అదానీ గ్రూప్‌స్టాక్స్‌ను కుదిపేశాయి.ఈసారి అదానీ గ్రూప్ సంస్థలను నేరుగా లక్ష్యంగా చేసుకోనప్పటికీ.. గతంలో చేసిన ఆరోపణలకు కొనసాగింపుగా ఈసారి సెబీ చీఫ్‌ను ఈ వ్యవహారంలోకి లాగడం గమనార్హం. దీంతో అదానీ గ్రూప్ స్టాక్స్‌పై మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తుండడంతో ఆ గ్రూప్ కంపెనీల షేర్లన్నీ నష్టాల్లో కొనసాగుతున్నాయి.అదానీ గ్రూప్‌నకు చెందిన అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ ఈ ఉదయం బీఎస్ఈలో ఏకంగా 17 శాతం మేర నష్టపోయింది. అదానీ టోటల్ గ్యాస్ 13.39 శాతం, ఎన్డీటీవీ 11 శాతం, అదానీ పవర్ 10.94 శాతం చొప్పున నష్టపోయాయి. అదానీ గ్రీన్ ఎనర్జీ 6.96 శాతం, అదానీ విల్మర్ 6.49 శాతం, అదానీ ఎంటర్‌ప్రైజెస్ 5.43 శాతం, అదానీ పోర్ట్స్ 4.95 శాతం, అంబుజా సిమెంట్స్ 2.53 శాతం, ఏసీసీ 2.42 శాతం చొప్పున నష్టపోయాయి. అయితే, తర్వాత కాస్త కోలుకున్నాయి.గౌతమ్ అదానీ సోదరుడు వినోద్ అదానీ నియంత్రణలోని కొన్ని బెర్ముడా, మారిషస్ ఫండ్‌లలో సెబీ చీఫ్ మాధబి పురి, ఆమె భర్త ధావల్ బచ్‌లు 2015లో పెట్టుబడులు పెట్టారు. ఈ దంపతుల వాటాల నికర విలువ 10 మిలియన్ డాలర్ల (సుమారు రూ.83 కోట్ల) వరకు ఉండొచ్చని హిండెన్‌బర్గ్ ఆరోపించింది. 2017లో సెబీ పూర్తికాలపు సభ్యురాలిగా మాధబి నియమితులయ్యారు. 2022 మార్చిలో సెబీ ఛైర్‌పర్సన్‌గా పదోన్నతి పొందారు. తమకు వాటాలున్న విదేశీ సంస్థలు కనుకే, అదానీ గ్రూప్‌పై సెబీ విచారణ తూతూమంత్రంగా జరిగేలా చేశారన్నది హిండెన్‌బర్గ్ తాజా ఆరోపణ. దీన్ని సెబీ చీఫ్‌తో పాటు అదానీ గ్రూప్ కూడా ఖండించింది.

## వినేశ్ ఫోగట్‌కు న్యాయం జరిగేనా..!



కాకుండా అథ్లెట్ల భద్రత, ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని కొన్ని స్వల్ప మార్పులు చేస్తారని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ మార్పులను త్వరలోనే అమల్లోకి తీసుకువచ్చే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

## వైద్యురాలిపై హత్యాచార ఘటన..

కుటుంబీకులను పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. "ఈ కేసులో మరింతమంది నిందితులు ఉన్నట్లయితే వారందరినీ ఆదివారం లోగా అరెస్టు చేస్తాం. ఒకవేళ అప్పటిలోగా రాష్ట్ర పోలీసులు కేసును పరిష్కరించలేకపోతే దర్యాప్తును సీబీఐకి అప్పగిస్తాం. ఈ కేసుపై ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారణ జరగాలని మేం కోరుకుంటున్నాం" అని దీదీ వెల్లడించారు.ఇదే సమయంలో కేంద్ర దర్యాప్తు సంస్థపై విమర్శలు గుప్పించారు. "సీబీఐ విజయాల రేటు చాలా తక్కువగా ఉంది. చోరీకి గురైన రబీంద్రనాథ్ ఠాగూర్ నోబెల్ బహుమతి కేసును వాళ్లు ఇంకా పరిష్కరించలేదు" అని మమత దుయ్యబట్టారు. విద్యార్థులు కోరుకుంటే ఈ కేసును సీబీఐకి అప్పగించేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని గతవారం కూడా సీఎం చెప్పిన సంగతి తెలిసిందే.మరోవైపు, కోల్‌కతా పోలీసు కమిషనర్ వినీత్ గోయల్ దీనిపై మాట్లాడారు. "ఒకరి కంటే ఎక్కువమంది ఈ నేరానికి పాల్పడటమో లేదా నిందితుడికి సహకరించి ఉంటారని మేం అనుమానిస్తున్నాం. దీనిపై దర్యాప్తు చేపట్టాం. హెల్ప్‌లైన్ నంబర్‌ను కూడా ప్రారంభించా. అనుమానితుల గురించి తెలిసిన వైద్య విద్యార్థులు ఫోన్ చేసి సమాచారం ఇవ్వొచ్చు" అని తెలిపారు.పోస్ట్ గ్రాడ్యుయేషన్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఆ జూనియర్ వైద్యురాలు ఆర్‌జీ కార్ ప్రభుత్వాస్పత్రిలో గురువారం రాత్రి విధుల్లో ఉన్నారు. శుక్రవారం ఉదయం ఆసుపత్రి సెమినార్ హాలులో అర్ధనగ్న స్థితిలో శవమై కనిపించారు. ఆమె మర్మాంగాలు, నోరు, కళ్ల నుంచి రక్తస్రావం జరిగినట్లు శవపరీక్షలో తేలింది. శరీరంపై వివిధచోట్ల గాయాలు కనిపించాయి. దీంతో ఆమెపై అత్యాచారానికి పాల్పడిన అనంతరం హత్య చేసినట్లు పోలీసులు నిర్ధరించారు. నిందితుడిని అరెస్టు చేశారు.

**హత్యాచారం చేసి నిందితుడు హాయిగా నిద్రపోయాడు..**

కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా కుదిపేస్తోంది. నిందితుడిని కఠినంగా శిక్షించాలంటూ నిరసనలు వ్యక్తమవుతున్నాయి.మరోవైపు ఈ కేసులో సంచలన విషయాలను పోలీసులు వెల్లడించారు. ఈ కేసులో నిందితుడి గురించి పోలీసులు వివరాలు తెలిపారు.కోల్‌కతాలోని ఆర్జీకార్ మెడికల్ కళాశాలలో నిందితుడు వైద్యురాలిపై అత్యాచారానికి పాల్పడి, హత్య చేసిన అనంతరం తాను ఉండే ప్రాంతానికి తిరిగొచ్చి హాయిగా నిద్రపోయినట్లు పోలీసులు తెలిపారు. ఆ తర్వాత ఉదయం సాక్ష్యాలను చెరిపివేయడానికి తన దుస్తులపై ఉన్న రక్తపు మరకలను తుడిచిపెట్టేందుకు ఉతుక్కున్నాడని చెప్పారు. అయితే.. అతడి బూట్లపై ఉన్న రక్తపు మరకల ఆధారంగా నిందితుడిని గుర్తించినట్లు తెలిపారు.పౌర వాలంటీర్ అయిన నిందితుడికి ఈ ఆస్పత్రితో ఎలాంటి సంబంధం లేదని.. అప్పుడప్పుడు ఇక్కడికి వస్తాడని విచారణలో తేలినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటన అనంతరం సిటీ పోలీసు కమిషనర్ వినీత్ గోయల్ మెడికల్ కళాశాలను రెండో రోజు పరిశీలించారు. నిరసనకు దిగిన వైద్యులతో సమావేశమయ్యారు. విచారణ పారదర్శకంగా జరుగుతోందని.. ఈ కేసులో ఎలాంటి వదంతులను వ్యాపింపజేయవద్దని కోరారు. ఈ కేసులో ఇంకెవరి ప్రమేయమైనా ఉందా..? అన్న ప్రశ్నకు స్పందిస్తూ.. ఇప్పటి వరకూ అలాంటి ఆధారాలు లభించలేదని.. బాధితురాలి తుది పోస్టుమార్టమ్ నివేదిక కోసం ఎదురుచూస్తున్నామని తెలిపారు. తమ దర్యాప్తులో లభించిన ఆధారాలతో నివేదికను పోల్చి చూడాల్సి ఉంటుందని వెల్లడించారు.ప్రాథమిక పోస్ట్‌మార్టమ్ నివేదిక ప్రకారం.. బాధితురాలి కళ్లు, నోరు, అంతర్గత అవయవాల నుంచి రక్తస్రావం చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. ఇతర భాగాల్లో కూడా గాయాలున్నట్లు తేలింది. అయితే.. వైద్యురాలిని మొదట హత్య చేసి.. ఆ తర్వాత నిందితుడు అత్యాచారానికి పాల్పడి ఉంటాడని మరో పోలీసు అధికారి వెల్లడించారు. గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకూ పనిచేసిన సిబ్బందిని విచారించినట్లు.. సీసీ టీవీ దృశ్యాలను పరిశీలించినట్లు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేపట్టినట్లు వివరించారు.నిరసనకు దిగిన జూనియర్ డాక్టర్లతో చర్చలు చేపట్టామని.. వారి డిమాండ్ మేరకు ఓపోలిస్ అధికారిపై చర్యలు తీసుకున్నట్లు పోలీసు కమిషనర్ వెల్లడించారు. ఈ కేసు విషయంలో పోలీసులు ఎలాంటి విషయాలను దాచడం లేదని తెలిపారు. మరోవైపు జూనియర్ వైద్యులు తమ డిమాండ్లు పూర్తిగా నెరవేరే వరకూ నిరసనను కొనసాగిస్తామని తేల్చిచెప్పారు.నిందితుడు సంజయ్ రాయ్ దర్యాప్తు సమయంలో ఎటువంటి పశ్చాత్తాపం వ్యక్తం చేయకపోగా.. తనను ఉరి తీయాలనుకుంటే తీసుకోవాలంటూ.. ఎదురుచెప్పినట్లు పోలీసులు చెబుతున్నారు. అతడి ఫోన్ నిండా అశ్లీల వీడియోలు ఉన్నట్లు తెలుస్తోంది. అతడికి ఇప్పటికే నాలుగు పెళ్లిళ్లు జరిగినట్లు సమాచారం.ఈ ఘటన చోటుచేసుకునే ముందు మృతురాలి గురించి పలు విషయాలను తోటి సిబ్బంది తెలిపారు. గురువారం రాత్రి విధుల్లోకి వచ్చిన ఆమె.. ఒలింపిక్స్ పోటీలను వీక్షించినట్లు చెప్పారు. ఈ ఘటన చోటుచేసుకోవడానికి కొన్ని గంటల ముందు నీరజ్ చోప్రా జావెలిన్ త్రో ఫైనల్‌ను ఆమె వీక్షించినట్లు తెలిపారు. తన తోటి సిబ్బందితో కలిసి డిన్నర్ చేసి.. ఆ తర్వాత తల్లికి ఫోన్ చేసి మాట్లాడినట్లు వివరించారు. ఆ తర్వాత ఆమె సెమినార్ హాల్‌లో చదువుకునేందుకు వెళ్లిపోయిందని పేర్కొన్నారు.మరోవైపు ఈ కేసు రాజకీయ రంగు పులుముకోవడంతో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కీలక వ్యాఖ్యలు చేశారు. వచ్చే ఆదివారం లోగా కోల్‌కతా పోలీసులు కేసును పరిష్కరించలేకపోతే.. దీన్ని సీబీఐకి అప్పగిస్తామన్నారు. ఈ ఘటనపై ప్రతిపక్ష భాజపా నుంచి తీవ్ర విమర్శలు ఎదురవుతున్న వేళ దీదీ ఈ వ్యాఖ్యలు చేశారు.

# నాలాల ఆక్రమణలపై ఉక్కుపాదం

మారుతుందన్నారు. త్వరలో హైడ్రాకు ప్రభుత్వం పెద్దఎత్తున సిబ్బందిని సమకూరుస్తుందని వివరించారు."హైడ్రాకు త్వరలోనే ప్రత్యేక పోలీసు స్టేషన్ ఏర్పాటవుతుంది. 2,500 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో హైడ్రా పరిధి ఉంది. గొలుసుకట్టు చెరువులన్నీ పునరుద్ధరిస్తాం. చెరువులకు నీటిని మళ్లించే నాలాలు పూడుకుపోయాయి. అవకాశవాదం వల్ల గొలుసుకట్టు చెరువులన్నీ మాయమయ్యాయి. చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఎవరూ స్థలాలు కొనుగోలు చేయవద్దు. చెరువుల పరిరక్షణకు అందరితో కలిసి మేథోమథనం చేస్తాం. పార్కు స్థలాలు పరిరక్షించే కాలనీ సంఘాలను సమర్థిస్తాం. నందగిరి హిల్స్ సొసైటీతో మాకు ఎలాంటి ఒప్పందం లేదు. చందానగర్‌లో గతేడాది బఫర్ జోన్‌లో నిర్మాణాలకు అనుమతులిచ్చారు. ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేస్తే చర్యలు తప్పవు. బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు చేపట్టాలంటేనే భయపడే స్థితికి తీసుకొస్తాం" అని రంగనాథ్ తెలిపారు. గొలుసుకట్టు చెరువులన్నీ పునరుద్ధరిస్తామని తెలిపారు. చెరువులకు నీటిని మళ్లించే నాలాలు పూడుకుపోయాయని, అవకాశవాదం వల్ల గొలుసుకట్టు చెరువులన్నీ మాయమయ్యాయని, చెరువు ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్‌లో ఎవరూ స్థలాలు కొనుగోలు చేయవద్దని సూచించారు. సోమవారం రంగనాథ్ మీడియాతో మాట్లాడారు. చెరువుల పరిరక్షణకు అందరితో కలిసి మేథోమదనం చేస్తామని, పార్కు స్థలాలు పరిరక్షించే కాలనీ సంఘాలను సమర్థిస్తామని, పార్కు స్థలాల్లో ఫెన్సింగ్ వేసేందుకు కాలనీ సంఘాలు సహకరిస్తున్నామని, బస్తీ వాసుల మెరుగైన జీవన ప్రమాణాలు పెరగాలని, నందగిరి హిల్స్ సొసైటీతో మాకు ఎలాంటి ఒప్పందం లేదని, చందానగర్‌లో గతేడాది బఫర్ జోన్‌లో నిర్మాణాలకు అనుమతులిచ్చారని, ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేస్తే హైడ్రా చర్యలు తప్పవని రంగనాథ్ హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో మెరుగైన ఫలితాలు చూస్తారని, బఫర్ జోన్, ఎఫ్‌టిఎల్ పరిధిలో నిర్మాణాలు కట్టాలంటే భయపడే స్థితికి తీసుకొస్తామని హెచ్చరించారు త్వరలోనే హైడ్రాకు ప్రభుత్వం పెద్ద ఎత్తున సిబ్బందిని సమకూరుస్తుందని, హైడ్రాకు త్వరలోనే ప్రత్యేక పోలీస్ స్టేషన్ ఉంటుందని, ప్రజల నుంచి హైడ్రాకు వందలాది ఫిర్యాదులు వస్తున్నాయని వివరించారు. 2500 చదరపు కిలో మీటర్ల విస్తీర్ణంలో హైడ్రా పరిధిలో ఉందని, దశల వారీగా హైడ్రా పని చేస్తుందని తెలియజేశారు. తొలి దశలో ఆక్రమణలను అడ్డుకోవడం హైడ్రా చేసే పని అని, రెండో దశలో ఆక్రమించి నిర్మించిన భవనాలపై చర్యలు, అనుమతుల నిరాకరణ ఉంటుందని, మూడో దశలో చెరువుల పూడిక తీసి వాన నీటిని మళ్లించి పునర్జీవనం కల్పించడం జరుగుతుందని ఆయన వివరణ ఇచ్చారు.

# పంద్రాగస్ట్ వేడుకలకు గోల్కొండకోట ముస్తాబు

**ఏర్పాట్లను పరిశీలించిన సిఎస్ శాంతికుమారి**

**15న తొలిసారి జెండా ఎగురేయనున్న సిఎం రేవంత్**



హైదరాబాద్, (ప్రజా మంటలు): రేవంత్ రెడ్డి పంద్రాగస్టు వేడుకలను గోల్కొండ కోటపైనే ప్రారంభిస్తారు. సీఎం హోదాలో ఆయన తొలిసారి గోల్కొండపై త్రివర్ణ పతాకం ఎగురవేయనున్నారు. అనంతరం అక్కడి నుంచి రాష్ట్ర ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. తెలంగాణ ఆవిర్భావం నుంచి 2023 స్వాతంత్ర్య వేడుకల వరకు మాజీ సీఎం కేసీఆరే గోల్కొండపై జెండా ఎగురవేసేవారు. కాగా.. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తొలిసారి జెండా పండుగను ఘనంగా నిర్వహించేందుకు ఘనంగా ఏర్పాట్లు చేస్తోంది. ముఖ్యమంత్రి 8 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి ఫలాలు వివరిస్తూనే.. గత బీఆర్ఎస్ సర్కార్ వైఫల్యాలను ఎత్తిచూపుతూ ప్రసంగం సాగనుంది. ముఖ్యమంత్రి సహా, ప్రముఖులు గోల్కొండ కోటకు తరలిరానుండటంతో ఏర్పాట్లను సీఎస్ శాంతకుమారి సోమవారం పరిశీలించారు.అమెరికా పర్యటన ముగించుకుని వచ్చి గోల్కొండలో ఏర్పాట్లను ఆమె పర్యవేక్షించారు. వర్షం కురిస్తే.. వేడుకలకు హాజరయ్యేవారు తడవకుండా వాటర్ ప్రూఫ్ టెంట్లు ఏర్పాటు చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. వీఐపీలు రానున్న నేపథ్యంలో ప్రజలకు అసౌకర్యం కలగకుండా బందోబస్తు, ట్రాఫిక్ ఏర్పాట్లు, పార్కింగ్ పై దృష్టి సారించాలని పోలీసులను ఆమె ఆదేశించారు. కాగా.. ఈ స్వాతంత్య్ర వేడుకల్లో తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఓ వైపు సీఎస్ ఆదేశాలతో అధికారులు పరుగులు పెడుతుంటే.. అదే స్థాయిలో గోల్కొండ కోట ముస్తాబవుతోంది. ఏటా రాష్ట్ర ప్రభుత్వం గోల్కొండలో స్వాతంత్య దినోత్సవాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది. జెండా వందనం చేసేందుకు ముఖ్యమంత్రి, మంత్రులు రానున్న నేపథ్యంలో అనేక భద్రత ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రముఖుల ముందు నిర్వహించే పరేడ్‌కి సంబంధించి రిహార్సల్స్ కూడా జరుగుతున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు, ఈ పరేడ్ స్వాతంత్ర్య వేడుకల్లో ప్రధాన ఆకర్షణగా నిలవనుంది.

# జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించడం ప్రభుత్వ బాధ్యత

## ఐ.జె.యి జాతీయ కౌన్సిల్ సభ్యులు జె. సురేంద్ర కుమార్

జగిత్యాల ఆగస్ట్ 12 (ప్రజామంటలు):

జగిత్యాల జిల్లా కేంద్రంలో జర్నలిస్టులు వారి హక్కుల సాధన కోసం చేస్తున్న నిరవధిక నిరసన దీక్ష పదవ రోజుకు చేరుకుంది. ఈ దీక్ష శిబిరానికి హాజరైన ఇండియన్ జర్నలిస్టు యూనియన్ జాతీయ కౌన్సిల్ సభ్యులు మాట్లాడుతూ.... జర్నలిస్టులు ఇళ్ల స్థలాల కోసం చేస్తున్న పోరాటం జర్నలిస్టుల హక్కు అని అన్నారు జర్నలిస్టులను తక్కువ చేసి చూస్తే సహించేది లేదన్నారు గత ప్రభుత్వాలు కరీంనగర్ జిల్లా కేంద్రంలో మండల కేంద్రాలలో ఇళ్ల స్థలాలు సాధించుకున్నామని ఈ సందర్భంగా గుర్తు చేశారు జగిత్యాల లో పనిచేస్తున్న పాత్రికేయులకు స్థలం ఇప్పించడంలో నిమ్మకు నీరెత్తినట్టు ప్రజా ప్రతినిధులు వ్యవహరిస్తున్నారన్నారు.

**జర్నలిస్టులకు న్యాయం జరిగే వరకు రైతు సంఘం మద్దతు:**జర్నలిస్టులకు న్యాయం జరిగే వరకు రైతు సంఘం మద్దతుగా నిలుస్తుందని రైతు సంఘం జిల్లా నాయకులు అన్నారు రైతులకు గిట్టుబాటు ధర కోసం చేసిన పోరాటంలో పాత్రికేయుల సహకారం మర్చిపోలేనిది అన్నారు జర్నలిస్టులు కోరిన కోరికలు చాలా చిన్నవే,వాటిని ప్రభుత్వం త్వరలోనే పరిష్కరించాలని అన్నారు జర్నలిస్టులకు న్యాయం జరగకపోతే రైతు సంఘం పక్షాన పోరాటం చేస్తామన్నారు ఈ కార్యక్రమానికి నాయకులు పన్నాల తిరుపతిరెడ్డి ఐల్నేని సాగర్ రావు భూమ్ రెడ్డి శ్యాం రాజిరెడ్డి మల్లయ్య మోహన్ రెడ్డి రాజయ్య గంగారెడ్డి సురేందర్ రెడ్డి, గోపాలరావు, మల్యాల, పెగడపల్లి మండల ప్రెస్ క్లబ్, అధ్యక్షులు తిరుపతి రెడ్డి,శ్రీనివాసరెడ్డి సంఘ సభ్యులు మద్దతు తెలిపారు , ఈ కార్యక్రమానికి, బిజెపి మహిళా మోర్చా నాయకురాలు ఎస్ భాగ్యలక్ష్మి మమత లక్ష్మీ కళావతి పుష్ప సోమలక్ష్మి,సభ్యులు పాల్గొన్నారు, వారితోపాటు గో, సేన అసోసియేషన్ యువత జిల్లా అధ్యక్షులు కట్ట శివకుమార్, జగిత్యాల ట్రస్మా నాయకులు కాటిపల్లి గంగారెడ్డి మనోహర్ రెడ్డి రామారావు శ్రీకాంత్ లతోపాటు ట్రస్మ సంఘం నాయకులు ఏఐఎస్ఎఫ్ కార్మిక సంఘం నాయకులు ఎండి అక్రమ్, ముఖేష్ మహేష్, పాత్రికేయులకు సంఘీభావం తెలిపారు దీక్షలో పాల్గొన్న, పాత్రికేయులు,పన్నాల కమలాకర్ రెడ్డి,బొడ్డు పల్లి అంజయ్య,సిరిసిల్ల వేణుగోపాల్,మిర్యాల వంశీ కృష్ణ రావు, కదార్ల రంజిత్,సంకోజీ లింగమూర్తి, ఇట్టే రాజు,అనంతుల కాంతారావులకు మాజీ మున్సిపల్ కౌన్సిలర్ గాజుల రాజేందర్ మజీ వైస్ చైర్మన్ మన్సూర్,జగిత్యాల క్లబ్ కార్యదర్శి పుప్పాల అశోక్ కుమార్ దీక్షలో పాల్గొన్న పాత్రికేయులకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింప చేశారు ఈ కార్యక్రమంలో టి.యు.డబ్ల్యూ జే.జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్షులు చీటి శ్రీనివాసరావు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, రాగుల గోపాల చారి ల తోపాటు ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియాపాత్రికేయులు పాల్గొన్నారు.










# ప్రతి రైతుకు తిరిగి రుణాలు ఇవ్వాలి

## రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షులు హింగే భాస్కర్

ఎల్కతుర్తి ఆగస్ట్ 12 (ప్రజామంటలు):

ఎల్కతుర్తి మండల కేంద్రంలోని పలు గ్రామాలలో ఇప్పటివరకు రుణమాఫీ కాని రైతులు చాలామంది ఉన్నారు రుణమాఫీ అయిన ప్రతి రైతుకు తిరిగి రుణం ఇవ్వాలని చిన్నచిన్న పొరపాట్లతో రుణమాఫీ ఆగిపోయిన రైతులకు అధికారులు కానీ దీనికి సంబంధించిన పై అధికారులకు విచారించి రైతు రుణమాఫీ కాని వారికి అయ్యేటట్టుగా చూడాలని అలాగే రుణమాఫీ అయినవారికి తిరిగి మళ్లీ బ్యాంకులో రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు కొంతమంది రైతులు బ్యాంకుల చుట్టూ తిరిగినా కానీ రెన్యువల్ కూడా చేయడం లేదని ఇలాంటి పరిణామాలు ఏర్పడితే రైతుల పక్షాన పోరాడవలసి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి రెడ్డి, సుధాకర్ రావు, రవీందర్, రమేష్, రాములు, రామారావు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



# ఆక్సిడెంటల్ గార్డ్ కింద భీమా వర్తింపుకై ప్రీమియం చెల్లింపు

జనగామ ఆగస్ట్ 12 (ప్రజామంటలు):




జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశాల మేరకు సోమవారం స్పెషల్ డ్రైవ్ కింద నర్మెట్ట మండలంలో ఎంపీడీఓ అరవింద్ ఆధ్వర్యంలో మల్టీ పర్పస్ వర్కర్లకు పోస్టల్ డిపార్ట్మెంట్ ద్వారా నడిచే ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంకు ద్వారా గ్రూప్ ఆక్సిడెంటల్ గార్డ్ కింద భీమా వర్తింపు కై ప్రీమియం చెల్లింపు కార్యక్రమాన్ని చేపట్టారు. మండల పరిధిలోని 57 మంది మల్టీ పర్పస్ వర్కర్ల కు భీమా వర్తింపు చేసారు. ఈ భీమా కింద 750 రూపాయల చొప్పున 65 సంవత్సరాల వరకు ప్రీమియం చెల్లించాలిసి ఉంటుంది. గ్రామ పంచాయతీ లో పని చేసినంత కాలం జిపి నిధుల నుండి ప్రతీ సంవత్సరం ఈ ప్రీమియంను బ్యాంకు వారికి చెల్లించడం జరుగుతుంది. ప్రమాదవశాత్తు మరణించిన లేదా ఆక్సిడెంట్ అయినప్పుడు శారీరక వైకల్యం కలిగిన, ఆక్సిడెంట వల్ల పక్షవాతం వచ్చిన 15 లక్షల రూపాయలు చెల్లిస్తారు.అలాగే ప్రమాదం సంభవించినప్పుడు వారికి 25 సంవత్సరాల లోపు చదువుకునే ఇద్దరు పిల్లలు ఉన్నట్లు అయితే ఇద్దరికీ లక్ష చొప్పున రెండు లక్షల రూపాయలను కూడా ఇస్తారు.ఆక్సిడెంట్ వల్ల హాస్పిటల్ ఖర్చు లకు 1,20,000, బోన్ సర్జరీ అయితే 70000 లు, %ాజూ% కి 30000, అంబులెన్స్ ట్రాన్స్పోర్ట్ 5,000 భీమా కింద వస్తుంది. ఈ కార్యక్రమంలో ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంకు మేనేజర్ లు జైల్ సింగ్, రమేష్ , పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# రాష్ట్రపతి భవన్ నుంచి ఆకర్షణకు ఆహ్వానం

## 8వ క్లాస్ విద్యార్థినికి అరుదైన అవకాశం

## తెలంగాణ నుంచి ఒక్కరికే ఆహ్వానం

సికింద్రాబాద్, ఆగస్ట్ 12 ( ప్రజామంటలు):



రాష్ట్రపతి భవన్ నుంచి ఆకర్షణకు అందిన ఇన్విటేషన్

ఈనెల 15 న స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనడానికి రాష్ట్రపతి భవన్ నుంచి స్టూడెంట్ ఆకర్షణకు ఆహ్వానం అందింది. వివరాలు ఇవి. సిటీ లోని సనత్ నగర్ కు చెందిన ఆకర్షణ (12) బేగంపేట లోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ లో 8 వ తరగతి చదువుతున్న స్టూడెంట్ తానే సొంతంగా పాఠశాలలు, అనాథాశ్రయాలల్లో గ్రంథాలయాలను ఏర్పాటుచేస్తుంది. ఇప్పటివరకు ఆకర్షణ 15 లైబ్రరీలను ఏర్పాటు చేసింది. త్వరలో మెట్రో స్టేషన్ లల్లో లైబ్రరీల ఏర్పాటుకు సంస్థ నిర్వాహకులతో ఒప్పందం కూడ జరిగింది. ఇటీవల ప్రధాని నరేంద్రమోదీ కూడ ఆకర్షణ లైబ్రరీలను ఏర్పాటు చేస్తుందని తెలుసుకొని, స్వయంగా ఆమెను పిలిచి, అభినందించారు. తన 25వ లైబ్రరీ ప్రారంభోత్సవానికి తాను స్వయంగా వస్తానని ప్రధాని అప్పుడు హామీ కూడ ఇచ్చారు. ఈ నేపధ్యంలో ఈనెల 15 ఇండిపెండెన్స్ డే గురువారం రోజున సాయంత్రం 6 గంటలకు రాష్ట్రపతి భవన్ లో నిర్వహించే ఎట్ హోమ్ రిసెప్షన్ కార్యక్రమానికి ఆహ్వానిస్తూ, రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము నుంచి సోమవారం ఆకర్షణకు ఇన్విటేషన్ అందినట్లు ఆమె తండ్రి సతీష్ తెలిపారు. కుమార్తె ఆకర్షణతో పాటు పేరెంట్స్ అయిన తాము కూడ న్యూఢిల్లీ వెళ తున్నట్లు ఆయన తెలిపారు. దేశవ్యాప్తంగా మొత్తం 20 మంది మాత్రమే పాల్గొనే రాష్ట్రపతి భవన్ ఎట్ హోమ్ రిసెప్షన్ కార్యక్రమానికి తెలంగాణ నుంచి ఆకర్షణకు ఒక్కరికే ఇన్విటేషన్ అందడం ఆనందంగా ఉందన్నారు. 20 మందిలో ఆకర్షణ ఒక్కరే గర్ల్ కావడం గమనార్హం. ఆకర్షణ భవిష్యత్ లో మరిన్ని లైబ్రరీలను ఏర్పాటు చేసేందుకు ఇలాంటి ప్రోత్సహాలు ఎంతో దోహదం చేస్తాయన్నారు.



ఆకర్షణను అభినందిస్తున్న ప్రధాని మోదీ ( ఫైల్)

# లోటస్ పాండ్ లో స్కూల్ కౌన్సిల్ ఎన్నికలు

**12న నామినేషన్ ప్రక్రియ, దరఖాస్తుల పరిశీలన**

**13న ఎన్నికల గుర్తుల కేటాయింపు**

**14న స్కూల్ లీడర్, క్లాస్ లీడర్ ఎన్నికలు**

**కరస్పాండెంట్ డాక్టర్ పుల్లూరి సంపత్ రావు**

జమ్మికుంట ఆగస్ట్ 12 (ప్రజామంటలు):

విద్యార్థులలో ఎన్నికల మీద అవగాహన కల్పించ డానికి జమ్మికుంట పట్టణంలోని లోటస్ పాండ్ పాఠశాలలో నమూనా ఎన్నికలలో భాగంగా సోమ వారం విద్యార్థుల నుండి నామినేషన్ పత్రాలు స్వీక రించామని పాఠశాల కరస్పాండెంట్, చైర్మన్ డాక్టర్ పుల్లూరి సంపత్ రావు తెలిపారు. ఇందులో భాగం గా నామినేషన్లు దాఖలు చేయడం,బ్యాలెట్ పేపరు ద్వారా ఓటు వేయడం, ఓట్ల లెక్కింపు, ఎన్నికల్లో గెలుపొందే విద్యార్థులకు ధృవీకరణ పత్రాలు అందజేయడం వంటి అంశాలపై అవగాహన కల్పించామని అన్నారు.. ఎన్నికల్లో సూల్ లీడర్, క్లాస్ లీడర్ కోసం ఎన్నికలు నిర్వహిస్తున్నామని, ఎన్నికల పోటీచేసే అభ్యర్థుల నుండి సోమవారం నామినేషన్ పత్రాలు స్వీకరించామని, వాటిని పరిశీలన చేసి 13 న ఎన్నికల గుర్తులు కేటాయిస్తామని, తరగతి గదులలో అభ్యర్థుల ప్రచారం ఉంటుందని అన్నారు.. ఎన్నికల్లో పనిచేసే ఎన్నికల అధికారులుగా, పోలీసులుగా, వైద్య సిబ్బం దిగా ఆగస్టు14న విద్యార్థులు వ్యవహరించనున్నారని అన్నారు..ఎన్నికలు ఆగస్టు14న కాగా స్కూల్ లీడర్, క్లాస్ లీడర్ గా ఎన్నికైన విద్యార్థులు ఆగస్టు 15న ప్రమాణ స్వీకారం ఉంటుందని, వారికి బాడ్జ్ లు అందిస్తామని పాఠశాల కరస్పాండెంట్, చైర్మన్ డాక్టర్ పుల్లూరి సంపత్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు నడిపెల్లి శ్రీనివాస్ టీచర్లు విద్యార్థులు పాల్గొన్నారు.




# పాలఉత్పత్తిదారుల సంక్షేమమే కరీంనగర్ డెయిరీ ధ్యేయం

- **హుస్నాబాద్ యంసీసి పరిధిలో 193మంది పిల్లలకు స్కాలర్షిప్ ల పంపిణీ..**
- **పశుగ్రాసం పెంపకం కింద 25మందికి నగదు పంపిణీ**
- **హుస్నాబాద్ మిల్క్ చిల్లింగ్ సెంటర్ మేనేజర్ చింతపుల నాగయ్య**

చిగురుమామిడి ఆగస్టు 12 (ప్రజామంటలు):

పాల ఉత్పత్తిదారుల సంక్షేమమే ధ్యేయంగా కరీంనగర్ డెయిరీ నిరంతరం పనిచేస్తుందని హుస్నాబాద్ మిల్క్ చిల్లింగ్ సెంటర్ మేనేజర్ చింతపుల నాగయ్య తెలిపారు. సోమవారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలోని నవాబుపేట, రేకొండ, బొమ్మనపల్లి, కొండాపూర్, ఉల్లంపల్లి, హుస్నాబాద్ మండలం రాములపల్లి,మహ్మదాపూర్ గ్రామాల్లోని కరీంనగర్ డేయిరీలో పాలు పోస్తున్న 193 మంది పాల ఉత్పత్తిదారుల పిల్లలకు ఒక్కొక్కరికి 8వందల రూపాయల చొప్పున 1,54,400 రూపాయల నగదును పంపిణీ చేసినట్లు మేనేజర్ నాగయ్య వివరించారు. అదదూడల ప్రోత్సాహం కింద 94మంది పాడి రైతులకు ఒక్కొక్కరికి 5 వందల చొప్పున 47వేల రూపాయల నగదును, పశు గ్రాసం పెంచే 25 మంది రైతులకు ఒక్కొక్కరికి 3 వేల రూపాయల చొప్పున 75వేల రూపాయలను కరీంనగర్ డెయిరీ చైర్మన్ చల్మెడ రాజేశ్వర్ రావు ఆదేశాల మేరకు అందజేసినట్లు తెలిపారు. పాలఉత్పత్తిదారులు పశువులకు ఇన్సూరెన్స్ చేయించాలనుకుంటే 4వందలకు 15వేలు, 5 వందలకు 20వేలు,6వందలకు 25వేల ఇన్సూరెన్స్ వస్తుందని మేనేజర్ నాగయ్య వివరించారు. వీటితోపాటు పాల ఉత్పత్తిదారులకు కల్యాణమస్తు, పాడి రైతు భరోసా, విద్యార్థులకు స్కాలర్షిప్స్, పాల నిధి,పాడి రైతు సంక్షేమ నిధి, విద్యా ప్రోత్సాహకాలు, పాలకేంద్రం భావన నిర్మాణానికి చేయూత, పాడి రైతు దాహన సంస్కారాలకు చేయూత తదితర సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ఇతర డెయిరీలకు కరీంనగర్ డెయిరీ ఆదర్శంగా నిలుస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ తిరుపతి రెడ్డి, సూపర్వైజర్ సీతా రవి, వివిధ గ్రామాల పాల కేంద్రాల అధ్యక్షులు ఠాగూర్ నరేందర్ సింగ్, కంది శంకర్, రవీందర్ రెడ్డి, రవీందర్, రాజు, రాజిరెడ్డి, తిరుపతి రెడ్డి, పాల ఉత్పత్తిదారులు డైరెక్టర్లు పాల్గొన్నారు.





# యువత మత్తు పదార్థాలకు బానిసలు కావద్దు

## జమ్మికుంట ఎక్సైజ్ సీఐ మాధవి లత

జమ్మికుంట ఆగస్ట్ 12 (ప్రజామంటలు):

కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలో 12 -8 -2024 రోజున ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దని జమ్మికుంట ఎక్సైజ్ సీఐ ఎం మాధవి లతా.సూచించారు జమ్మికుంట మండలం కోరపల్లి గ్రామంలో జెడ్పిఎస్ హెచ్ పాఠశాలలో కరీంనగర్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మత్తు పదార్థాలకు మానసికంగా శారీరకముగా ఆర్థికముగా సామాజికంగా ఎదురయ్య ఇబ్బందుల గురించి విద్యార్థులకు వివరించడం జరిగింది. వారి భవిష్యత్తు కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సమ్మయ్య, ఉపాధ్యాయులు ఎక్సైజ్ ఎస్సై సౌమ్య, కానిస్టేబుల్ సాయి కృష్ణారెడ్డి, విశ్వ, మహేష్, రేణుక, ఫయాజ్, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.



## వ్యాసకర్తలకు వినతి

రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాలపై వ్యాసాలు పంపేవారు మీ వ్యాసాలను వీలైనత క్లుప్తంగా, వివరణాత్మకంగా, 350-400 ల పదాలకు పరిమితం అయి ఉండేలా చూడండి. పెద్ద వ్యాసాలను పరిశీలించనడం సాధ్యం కాకపోవచ్చని గ్రహించగలరు. వర్డ్ డాక్యుమెంట్, లేదా ఓపెన్ ఫైల్ లో, ఈ మెయిల్ కు మాత్రమే పంపగలరు.

mantalukathalu@gmail.com

-ఎడిటర్

# తెలంగాణ తొలి శతావధాని శిరశినగల్ కృష్ణమాచార్యులు

## ఆగస్టు 12...శిరశినగల్ కృష్ణమాచార్యులు జయంతి



రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494


తెలంగాణ గర్వించదగిన కవి శిరశినగల్ కృష్ణమాచార్యులు. అభినవ కాళిదాసు, నైజాం రాష్ట్రాద్య శతావధాని, పండిత రత్న, ఉభయవేదాంత విద్వాన్, ఉభయ వేదాంతా చార్య , కోరుట్ల కృష్ణమా చార్యులు తదితర బిరు దాంకితులు.

కృష్ణమాచార్యులు నిజామా బాద్ జిల్లా లోని మోర్తాడ్ గ్రామంలో 1905, ఆగస్టు 12 వ తేదీ క్రోధి నామ సంవత్సర, శ్రావణ శుక్ల విదియ నాడు రంగమ్మ, వేంకటా చార్య పుణ్య దంపతులకు జన్మించారు. బాల్యంలో పితా మహులైన సింగారాచార్యుల, తండ్రి గారైన వేంకటాచార్యుల వద్ద విద్యను అభ్యసించారు. తరువాత మాతామహులైన గోవిందా చార్యుల వద్ద 1914 నుండి 1921 వరకు ఏడు సంవత్స రాలు కావ్య, నాటక, అలంకార, సాహిత్య గ్రంథాలు, తిరు మంత్రార్థము, శ్రీ వచన భూషణ వ్యాఖ్యానము మొదలైన గ్రంథాలు అధ్యయనం చేశారు. ఆనంతరం వల్లంకొండలో కనకా పురం శ్రీనివాసాచార్యుల వద్ద తర్క ప్రకరణాలు, మోర్తాడులో కందో ఝుల వెంకన్న వద్ద సిద్ధాంత భాగము, పిఠా పురంలో గుదిమెళ్ళ రంగాచార్య వద్ద వేదాంత మును అభ్యసించారు.

ఆయన 1926 నుండి కోరుట్ల లోని ఉభయవేదాంత సంస్కృత పాఠశాలలో ఉపాధ్యాయులుగా ప్రవేశించి, ధర్మపురి, కరీంనగర్ సంస్కృత పాఠశాలలలో విధులు నిర్వర్తించి, కోరుట్లలో ప్రధానోపాధ్యాయులుగా పదవీవిరమణ చేశారు. పలువురు విద్యార్థులకు సంస్కృత సాహిత్యం నేర్పించారు.

సంస్కృతాంధ్రాలలో 40కి పైగా గ్రంథాలను రచించారు. వీటిలో కావ్యాలు, శతకాలు, సుప్ర భాతాలు, స్తుతిగీతాలు, హరికథలు మొదలైనవి ఉన్నాయి కళాశాల అభ్యు దయం, రామానుజ చరితం, చిత్ర ప్రబంధం రత్నమాల (ఖండ కావ్యం) మనస్సందేశ కావ్యము, సంపత్కుమార సంభవ కావ్యము, గాంధీ తాత నీతిశతకము, గీతాచార్య మతప్రభావ శతకము, వెదిర వేంకటేశ్వరస్వామి సుప్రభాతము, ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి సుప్రభాతము, వేణుగోపాల స్వామి సుప్రభాతము, నంబులాద్రి నృసింహస్వామి సుప్రభాతము, పద్మావతీ పరిణయము (హరికథ) రుక్మిణీ కళ్యాణము (హరికథ) ముకుందమాల యామునా చార్యులవారి స్తోత్ర రత్నగీత ములు విశిష్టాద్వైతమత సంగ్రహము వేదార్థ సంగ్రహము (అనువాదం) గురువంశ కావ్యనిధి, స్వీయ కవితాను జీవనం ఆత్మకథ తదితర రచనలు చేశారు.

ఆయన కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి తదితర పట్టణాలలో అష్టావ ధానాలు, శతావ ధానాలు చేశారు. తెలంగాణా ప్రాంతంలో మొట్టమొదటి అవధానిగా కీర్తి గడించారు. నైజాం రాష్ట్రాద్య శతావధాని, పండితరత్న, ఉభయ వేదాంత విద్వాన్, ఉభయ వేదాంతా చార్య మొదలైన బిరుదులు పొందారు.



తిరుమల తిరుపతి దేవస్థానం వారు, ఢిల్లీలో జియ్యర్ స్వామి, మొదటి ప్రపంచ తెలుగు మహా సభలలో ముఖ్య మంత్రి జలగం వెంగళరావు ఘనంగా సత్కరిం చారు. శతావధాని కృష్ణమా చార్యుల రచనలపై పలువురు కాకతీయ, ఉస్మానియా యూని వర్సిటీల్లో పిహెచ్‌డిలు చేశారు.

# ప్లాస్టిక్ కవర్లు వద్దు గోనె సంచులు ముద్దు

ప్లాస్టిక్ ను విపరీతంగా వాడడం వలన రకరకాల రోగాలు వస్తున్నాయి .ప్లాస్టిక్ వస్తువులతో కవర్లతో కుప్పలు తెప్పలుగా చెత్త పేరుకుపోయి అవి భూగర్భంలో కరిగిపోకుండా పర్యావరణానికి ఎంతో నష్టాన్ని కలుగజేస్తున్నాయి . వాటిని కాల్చినా కూడా వాటి నుండి వచ్చే వాసన వలన ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులు వస్తున్నాయి .అది మరి ప్రాణాంతకం.కాబట్టి "విద్యార్థులారా మీరైనా ప్లాస్టిక్ వస్తువులను ప్లాస్టిక్ కవర్లను వాడకండి" ఇదే విషయాన్ని మీరు "ముగ్గురికి తెలియజెప్పండి .ఆ ముగ్గురిని మరో ముగ్గురికి తెలిసేలా చైతన్యం చేయండి" అంటూ సైన్స్ టీచర్ చెప్పింది. విద్యార్థులందరూ సరైనన్నారు

మహేష్ తర్వాత గదిలో చురుకైన విద్యార్థి. సైన్స్ టీచర్ చెప్పిన విషయాన్ని తన ఇంటి చుట్టుపక్కల ఉన్న వారిని పిలిచి ప్లాస్టిక్ వలన వాటి వాడకం వలన కలిగే నష్టాలను పూసగుచ్చినట్లు వివరించాడు .అంతేకాకుండా అందరూ కిరాణం వస్తువులకు కూర గాయాలకు, మార్కెట్ కి వెళ్ళిన కవర్లకు బదులుగా గోనెసంచులను తీసుకెళ్దాం. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అంటూ చైతన్యపరిచాడు. అంతేకాకుండా మాంసం కొరకు స్టీల్ టిఫిన్ బాక్సులతో వెళదాం అంటూ చెప్పాడు. మీరు నేను చెప్పింది వినడం కాదు మీరు మరో ముగ్గురికి ప్లాస్టిక్ వాడకం ద్వారా ఇలాంటి కష్టనష్టాలు ఉన్నాయో తెలియజెప్పండి మనమందరం రేపటి నుండి యుద్ధ ప్రాతిపదికగా ప్లాస్టిక్ కవర్లను వస్తువులను వాడకుండా ఉందాం అందరికీ ఆదర్శంగా నిలుద్దాం అన్నాడు మహేష్.

మహేష్ చెప్పినటువంటి మాటలు విన్న ఇరుగుపొరుగు వాళ్ళు మార్కెట్ కి , మాంసం దుకాణానికి, కిరాణం వస్తువులకు వెళ్లిన గోన సంచులను తీసుకెళ్తున్నారు. క్రమంగా ప్లాస్టిక్ వస్తువులకు బదులుగా స్టీల్ వస్తువులనే వాడుతున్నారు. తమ ఉపాధ్యాయుడు చెప్పినట్టు క్రమక్రమంగా అందరూ ప్లాస్టిక్ కవర్లను వాడటం మానేశారు. ఇరుగుపొరుగు వారు మాత్రమే కాకుండా తమ గ్రామంలో ఉన్న గ్రామస్తులు అందరు కూడా ప్లాస్టిక్ కవర్లను నిషేధించి గోనెసంచులు వాడటం ప్రారంభించారు. ప్రజలలో వచ్చిన మార్పును చూసి మహేష్ చాలా సంతోషించాడు

నీతి: ప్లాస్టిక్ భూతాన్ని తరిమేద్దాంబి ఆరోగ్యాన్ని కాపాడుకుందాం.

యాడవరం చంద్రకాంత్ గౌడ్
సిద్దిపేట, 9441762105

# కొడితే లీడర్లను కొట్టండి సార్..- ఎక్కడికో ఎదిగిపోతరు!

తీక్షణమైన పర్యవేక్షణ ఉండే శాఖల్లో పోలీసు డిపార్ట్మెంట్ ముందుంటుంది. శిక్షణలోనే ప్రతిజ్ఞ, క్రమశిక్షణ అలవర్చుతుంది. అనేక విధి విధానాలు, కట్టుబాట్లు, బాధ్యతలు, పరిమితులనూ నూరిపోస్తుంది. ఎస్.హెచ్.వో.పై మొదలు ఆయా దశల్లో అంచెలంచెలుగా వివిధ విభాగాల ఆఫీసర్ల మీద స్పార్క్ నియంత్రణ సొంతం. క్షేత్ర అధికారి కదలికలు మొదలుకొని ఏరోజుకారోజు కార్యకలాపాలు పరస్పరం పైదాకా చేరతాయి. ఉదయం టీ కాఫీతోనే కడపటి దినం పనులు, చర్యలు, ఈ రోజటి నిర్దేశాలతో టెలీ, వీడియో కాన్ఫరెన్సులు పోటీ పడతాయి. నేరుగా తనిఖీలు ఉండనే ఉంటాయి.మారిన తేదీనాటి విశేషాలు, సంగతులు ఏవీ పై ఆఫీసర్లకు నివేదించకుండా దాయడానికి ఉండదు. ముఖ్యంగా అనుమానితులు, నిందితులు, ఇతరులు సూర్యాస్తమయానికల్లా ఠాణాలో ఎవరూ లేకుండా క్లియర్ చేస్తారు. ఎన్ని ఒత్తిళ్లు ఉన్నా, మరే నేపథ్యం కలిగినా స్టేషన్ లో, సెల్ లో, మరెక్కడో నిర్బంధించేందుకు రిస్క్ తీసుకోరు. కొట్టేందుకూ సంశయిస్తారు. ఆ కాలం పోయిందని సర్ది చెప్పుకొంటారు. ఏవైనా అత్యంత సంక్లిష్టమైన, అరుదైన కేసుల్లో హై ఎండ్ సూచనలు, ఆదేశాలు ఉంటే తప్ప! ఇంతటి పదునైన సిస్టమ్ ఉన్నప్పటికీ షాద్ నగర్ వంటి అత్యంత బాధాకరమైనవి, అవాంఛనీయమైనవి ఏదోచోట ఉనికిలో ఉంటున్నాయి. గట్టిగా తన్నాలని, బాగా కొట్టాలని ఫిర్యాదీలకు ఉత్సాహం, కసి ఉండొచ్చు. అలా చేయకపోతే అధికారిపైనే కంప్లయింటుదార్లకు అపోహలు కలుగొచ్చు. కానీ ఆఫీసర్ వాటికి అతీతంగా వ్యవహరిస్తారు. అంతులేని భావోద్వేగాలు, హద్దులెరగని కోపతాపాలు, అసహనం, అతి పొగరు, ఓవర్ రుబాబు, నోటి పైత్యం, రాగద్వేషాలు, పలుకుబడి బాపతులు ఉసిగొల్పడాలకు లొంగిపోయినపుడే ఇలాంటి దృష్టాంతాలు ఉత్పన్నం అవుతున్నాయి. నిగ్రహాన్ని డామినేట్ చేయని మనో నిబ్బరంతో,చట్టం నియమాల ఫ్రేములో మసలుకోనపుడే అనర్థాలు సంభవిస్తున్నాయి.జీవన నైపుణ్యాలు, వ్యక్తిత్వాన్ని ఇనుమడింపజేసేందుకు దోహదపడే వ్యాయామం, ప్రాణాయామం వంటి ఫిట్ నెస్ మెలకువల అవసరాన్ని చాటుతున్నాయి. సీసీ కెమెరాలతో ఎంతోకొంత పని సులువైన తొలి లాభిత ఈ శాఖ సాంకేతిక సాధనాలను ఎప్పటికప్పుడు అందిపుచ్చుకొంటున్నది. దర్యాప్తు, విచారణ/ఇంటరాగేషన్ కు వచ్చేసరికి ఇంకా మొరటుగానే ఏదో మూలన మెదులుతున్నారు. తమ దేహాల మాదిరే సాటి మనుషుల దేహాలనే స్పృహ కలిగి ఉండటంలో అక్కడక్కడ వెలితి ఉందని షాద్ నగర్ ఘటన మరోసారి ప్రస్తావింపజేస్తోంది.రేపటి పౌరుడైన ఆ బాలుడి మదిలో తన తల్లి పట్ల ప్రవర్తించిన తీరుపై మన వ్యవస్థల మీద ఎలాంటి ముద్ర పడి ఉంటుంది? దర్యాప్తు బాధ్యతలు, టాస్కులు ఇచ్చే ఉన్నతాధికారులు కూడా అడ్డగోలు ఫోర్సుతో కాకుండా వాస్తవా లకు దగ్గరైన ప్రాతిపదికన ఐ.వో.లను సంభాళించాల్సిన పరిస్థితి నిషాద్ నగర్ వంటి హృదయాలను బరువెక్కించేఘటనలు గుర్తు చేస్తున్నాయి. పోలీసు శాఖ అంతర్గతంగా తనకు తానుగా పౌరుల్లో చిట్ట చివరి వరకు నమ్మకం, గౌరవం దృఢంగా నెలకొనేలా పరివర్తనకు పాటుపడాలి.ప్రభుత్వమూ సంచలన ఉదంతాలపుడే స్పందన, చర్యలతో సరిపెట్టకుండా అనర్థాల మూలాలపై మనసు పెట్టాలి.క్షేత్రంలో ఉండే హోంగార్డు మొదలు పై ఆఫీసర్ల వరకు వారి సాధకబాధకాలు వినాలి.చాలినన్ని జీత భత్యాలు, సౌలభ్యాలు, సాధనా సంపత్తి సమకూర్చివారిలో ప్రశాంతత నెలకొల్పాలి. మొత్తంగా వ్యవస్థలోని లోపాలకు సామాన్యులు నైవేద్యం కాకుండా చూడాలి.ప్రభుత్వం, పాలకుల గురించి ప్రజలు అనుకునేదానిపై పోలీసింగ్ కూడా ఆధారపడి ఉంటుందని గ్రహించాలి.ప్రతిపక్షంలో ఉన్నప్పుడు గిట్టని పోలీసులే ప్రభుత్వం లోకి వచ్చేసరికి ముద్దయితే అయ్యిరి! వారి సూపర్ సెల్యూట్, గట్టి ప్రొటోకాల్ రెస్పెక్ట్ వంటివి మైమరిపించితే మైమరిపించే! కానీ ఏ ఒక్క సామాన్య వ్యక్తికీ శాపంగా పరిణమించకుండా చూస్తే చాలు. అదే పది వేలు! తెలంగాణ తొలి ప్రభుత్వం తొలి టర్ములో నేరెళ్ళ ఉదంతం, మలి పర్యాయంలో ఖమ్మం జిల్లాలో మరియమ్మ లాకప్ డెత్ వంటివి విస్మరించలేనివి. అపుడు విపక్షంలో ఉండి గళమెత్తిన కాంగ్రెస్ నేడు అధికారంలో ఉంది.దుశ్చర్యలపై చలించడం, ఖండించడం, బాధితులను చేరుకోవడం ప్రతిపక్షంలో ఉన్న వారికి మాత్రమే డ్యూటీ అనే భావదారిద్ర్యం ఎపుడు వీడేనో? నోటితో, చేతలతో, పావులు కదపడాలతో ఊహకూ అందని రకరకాల హింస పెట్టే తత్వం గల పోలీసు సార్లు ఎవరైనా ఉంటే..వారికి హంబుల్ రిక్వెస్ట్ ఏమంటే..కొడితే లీడర్లను కొట్టండి! పోలీసు దెబ్బలు, కేసులు, జైలు, బహిష్కరణల పాలైన లీడర్లు ఎక్కడికో ఎదిగిపోతరనే పేరుంది!మళ్లీ ప్రభుత్వంలోకి రావడం,చట్ట సభల సభ్యులుగా, మినిస్టర్లు, ముఖ్యమంత్రులుగా, దేశ హోం మంత్రులుగా అల్టిమేట్ పొజిషన్ లోకి వెళతారనే భావన ఉంది.(లీడర్లనైనా కొట్టి హింసించాలని కోరుకునే ఉద్దేశం వ్యాసకర్తకు లేదు సుమీ)బంగ్లాదేశ్ లో వర్తమాన పరిణామాలకు దారి తీసిన రిజర్వేషన్ల ఉద్యమాన్ని గాలివానగా మార్చిన స్టూడెంట్ లీడర్ నహీద్ ను ఆ దేశ పోలీసులు బాగా కొట్టి, రోడ్డు మీద పారేయడంతో పాపులర్ అయ్యాడట! కాబట్టి సాధారణ పౌరులను మాత్రం మినహాయించండి!

ఇల్లెందుల దుర్గాప్రసాద్ ,సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్టు
హైదరాబాద్ .9440850384

## వివేకవం ఉంటే రాణించవచ్చు !

తిరుమల, (ప్రజామంటలు): మనిషి ధనవంతుడే కావచ్చు, విద్యావంతుడే కావచ్చు, సర్వాంగ సుందరుడే కావచ్చు కాని బుద్ధిమంతుడు కాకపోతే ఆ ధనం, విద్య, సౌందర్యం ఎందుకూ కొరగావు. బుద్ధిమంతుడు అంటే ఏకసంథాగ్రాహి, మహామేధావి అని కాదు- సద్బుద్ధి కలవాడని అర్థం. సద్బుద్ధి అంటే వివేకంతో కూడిన బుద్ధిశక్తి. మంచీచెడుల మధ్య తేడా తెలియడమే వివేకం. మనిషికి బుద్ధిశక్తి ఉన్నా వివేకం లేకపోతే అది వక్రమార్గం పడుతుంది. మనిషికి గొప్ప తెలివితేటలు లేకపోయినా పెద్దగా ఇబ్బంది లేదు కాని దుర్బుద్ధి ఉంటే చాలా ప్రమాదకరం. మనిషి ఎదిగినా, దిగజారినా, పేరు ప్రఖ్యాతులు గడించినా, అపఖ్యాతి మూటకట్టుకున్నా- అదంతా బుద్ధి మహిమే. ఇహపరాలు రెండూ బుద్ధి చేతుల్లోనే ఉంటాయి. సద్బుద్ధి ఉంటే మంచి స్నేహితులు, శీల సంపద, గౌరవ మర్యాదలు, సత్సంబంధాలు, మనోనిర్మలత, ఆత్మవివేచన కలిగి ఉంటారు. దుర్బుద్ధి ఉంటే కపటత్వం, అసూయాద్వేషం, అసహనాలు ఆవరిస్తాయి. మనిషి దేహాంగాలన్నీ దివ్యంగా పనిచేస్తున్నా, బుద్ధి ఒక్కటి వక్రంగా పనిచేస్తే చాలు- జీవితం పతనమవుతుంది.

## చేధించరానిది.. ఉంటుందా!?

పలుకడానికి
పెదవే కావాలా
సముద్ర ఘోషకు
పెదవి ఎక్కడిది!
కోకిలకు
ఏ సంగీతం తెలుసు
అనురాగానికి
రాగం అవసరమా!
ఎదురుచూపుకు
నిద్దుర ఉంటుందా
నిద్దుర లేని ప్రయత్నం
విజయం దరి చేర్చదా!
శోధించేవాడికి
చేధించరానిది ఉంటుందా!?

జగ్గయ్య.జి
9849525802

# ప్రాంతీయ పార్టీలకు సెగ పెడుతున్న మోడీ !

ప్రాంతీయ పార్టీలకు దేశంలో రాజకీయ మనుగడ జీవన్మరణ సమస్యగా మారింది. వివిధ కేసులతో ఆయా పార్టీల నేతలను వేధిస్తున్న తీరు కారణంగా అవి ఉనికిని కోల్పోయే ప్రమాదంలో పడ్డాయి. బిజెపి ముఖ్యంగా మోడీ ద్వయం ఇదే కోరుకుంటోంది. ఈ క్రమంలో దేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను వారు గట్టిగా నిలదీయలేక పోతున్నారు. దేంలో రాష్ట్రాలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రాంతీయ పార్టీలను కేంద్రం కూడా విశ్వాసంలోకి తీసుకోలేక పోతున్నది. ఇటీవల పార్లమెంట్ సమావేశాల్లో ఎలాంటి సమస్యపైనా చర్చ చేయకుండా మమ అనిపించడమే ఇందుకు నిదర్శనం. జిఎస్టీపై నిర్మలా సీతారామన్ తలబిరుసుగా సమాధానం ఇచ్చినా రాష్ట్రాల్లో గట్టిగా నిరసనలు తెలపలేక పోయారు. ప్రజల సమస్యలను నిలదీయడంలో ఈ పార్టీలు విఫలం అవుతున్నాయి. ఇకపోతే దారికి తెచ్చుకునే క్రమంలో జార్ఖండ్, ఢిల్లీ ముఖ్యమంత్రులకు ఇడి వేధింపులు ఇందుకు ఉదాహరణగా చూడాలి. ఢిల్లీలో అధికారాన్ని చేజిక్కించు కోవడం కోసం ఆమ్ ఆద్మీ పార్టీని, ఆ పార్టీ అధినేత ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను తుదముట్టించ డం కోసం బీజేపీ చేయని ప్రయత్న మంటూ లేదు. నిజానికి అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీలో కాంగ్రెస్‌ను దెబ్బ తీయడంలో బీజేపీకి సహాయపడ్డారు. పంజాబ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించగలిగారు. ఓ రకంగా కాంగ్రెస్ ముక్త నినాదానికి ప్రయత్నించారు. ఇలా రెండు రాష్ట్రాల్లో కాంగ్రెస్‌కు ఉనికిలేకుండా చేయగలి గారు. గుజరాత్, గోవాలో కాంగ్రెస్ ఓట్లను చీల్చారు, తన సంక్షేమ ఎజెండాయే దేశ వ్యాప్తంగా కాంగ్రెస్‌తో సహా ఇతర పార్టీలు అనుకరించేలా చేయగలిగారు. కాంగ్రెస్ బలహీనపడుతున్న కొద్దీ ఆప్ బలపడింది. అయినప్పటికీ మోదీ సకల ఆయుధాలు కేజ్రీవాల్‌పై ప్రయోగించడంతో ఆయన తన రాజకీయ అస్తిత్వం కోసం పోరాడుతున్నారు. ఆప్ జీవన్మరణ సమస్యలో ఉంది. బెయిల్ దొరక్క పోవడంతో ఆయన సుప్రీంను ఆశ్రయించారు. జార్ఖండ్ సిఎం సోరేన్ ఎలాగో బెయిల్ దక్కించుకుని మళ్లీ పీఠం ఎక్కారు. అయినా వీరికి తాత్కాలిక ఏరట మాత్రమే దక్కింది. బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ తనయ కూడా బెయిల్ కోసం నానా తంటాలు పడుతున్నారు. ప్రాంతీయ పార్టీలు బలహీనపడితే వాటి స్థానంలో బలపడేందుకు కాంగ్రెస్‌కే ఎక్కువ ఆస్కారం ఉన్నది. ఎందుకంటే కాంగ్రెస్ ఓటు బ్యాంకునే ప్రాంతీయ పార్టీలు అధికంగా కొల్ల గొట్టాయి. బీజేపీ క్రియాశీలకంగా మారడానికి ముందే ప్రజలు కాంగ్రెస్ పట్ల వ్యతిరేకతతో ప్రాంతీయ పార్టీలను ఆదరించారు. ఇవాళ దేశంలో ఉన్న అనేక ప్రాంతీయ పార్టీల పుట్టుకకు కాంగ్రెస్ అనుసరించిన విధానాలే కారణం. ఇప్పుడు మోదీ కూడా ప్రాంతీయ పార్టీలను బలహీనపరిస్తే చివరకు ప్రధాన పోటీ మళ్లీ బీజేపీ, కాంగ్రెస్‌లకే పరిమితం కావడం ఖాయం అని భావించారు. మొన్నట ఇపార్లమెంట్ ఎన్నికల్లో ఇది కొంత మేర సఫలం అయ్యింది. అందుకే కాంగ్రెస్ ఎక్కువ సీట్లను దక్కించుకోగలిగింది. అదే సమయంలో బిజెపి తన సీట్లను భారీగా కల్పోయింది. కాంగ్రెస్ ముక్త భారత్ లక్ష్యం సాధించడం కష్టమని గ్రహించినందు వల్లే మోదీ ప్రాంతీయ పార్టీలను లక్ష్యంగా పెట్టుకున్నారా? అన్న అనుమానాలకు ఆస్కారం లేకపోలేదు. ఏమైనా అటు బీజేపీ, ఇటు కాంగ్రెస్ మధ్య ప్రాంతీయ పార్టీలు నలిగిపోయే పరిస్థితి పలు రాష్ట్రాల్లో కనిపిస్తోంది. బిజెపి పనితీరు సక్రమంగా లేకపోవడం వల్లనే కర్నాటక, తెలంగాణలో ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరించారు. కర్నాకటలో బిజెపి కరప్షన్ కారణంగా ప్రజలను దూరం చేసు కుంది. తెలంగాణలో కెసిఆర్ అహంకారాన్ని అణచి వేసేందుకు ప్రజలు కాంగ్రెస్‌ను ఎంచుకున్నారు. రాజకీయంగా మరింతగా బలపడేం దుకు మోదీ అవినీతి అంశాలన్ని ఒక ప్రయోగంగా ఉపయోగించుకుంటున్నారా అన్నది చర్చనీయాంశ మవుతోంది. 2014లో లోక్‌సభ ఎన్నికల ప్రచారం తారస్థాయికి చేరుకున్న దశలో నరేంద్రమోదీ ఈ దేశాన్ని కాంగ్రెస్ నుంచి విముక్తం చేయాలని పిలుపు ఇచ్చారు. కాని 10 సంవత్సరాల పాలన తర్వాత కూడా ఆయన దేశాన్ని కాంగ్రెస్ నుంచి విముక్తం చేయ లేకపోయారు. సరికదా కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయ గలిగారు. కర్ణాటకలో బీజేపీ ఘోరపరాజయం చెందిన తర్వాత దక్షిణాది రాష్ట్రాల్లో బీజేపీకి అవకాశం లేకుండా పోతున్నది. ఇదంతా స్వయంకృతమని తెలంగాణ నిరూపించింది. కర్ణాటకతో పాటు హిమాచల్‌లో కూడా కాంగ్రెస్ అధికారంలోకి రాగలిగింది. తరవాత తెలంగాణలోనూ కాంగ్రెస్ పాగా వేసింది. ఆంధ్రప్రదేశ్ లో టిడిపితో జతకట్టడం ద్వారా బిజెపి లబ్ది పొందింది. తమిళనాడులోని రెండు ప్రాంతీయ పార్టీలూ బీజేపీకి దూరంగా మారాయి. కర్ణాటకలో అంతరించిపోయే స్థితిలో జనతాదళ్ (ఎస్) బీజేపీతో చేతులు కలిపింది. తెలంగాణలో మోడీ ఉధృత ప్రచారం చేసినా మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో అత్తెసరు సీట్లు వచ్చాయి. మోదీ ప్రాంతీయ పార్టీలను అణిచివేయడంపైనే అధికదృష్టి సారిస్తున్నారనే ప్రచారం ఉంది. అందుకు పాలు రాష్ట్రాల్లో నేతలు ఇడి, సిబిఐ కేసుల్లో జైలుకు వెళ్లారు. ఈడీ, సీబీఐలను ప్రయోగించి మహారాష్ట్రలో నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ, శివసేనలను బీజేపీ చీల్చగలిగింది. పంజాబ్‌లో అకాలీదళ్‌ను దెబ్బతీసింది. బిహార్‌లో లోక్ జనశక్తిని ముక్కలు చేసింది. నితీశ్ కుమార్‌కు పొమ్మనకుండా పొగపెట్టి పంపించింది. తరవాత మళ్లీ దారికి తెచ్చుకుంది. ఉత్తరప్రదేశ్‌లో మాయావతి నేతృత్వంలోని బీఎస్పీని బీజేపీ నిర్వీర్యం చేసింది. సమాజ్‌వాది పార్టీని అస్తిత్వం కోసం పోరాడే పరిస్థితిని కల్పించింది. ఒడిషాలో నవీన్ పట్నాయక్ తర్వాత బీజేడీ భవిష్యత్ ఏమిటన్నది ప్రశ్నార్థకమైంది. తాజాగా జార్ఖండ్‌లో కూడా హేమంత్ సోరెన్‌ను సిఎం పదవి వీడేలా చేసింది. అయితే ఆయన చట్టపరంగా పోరాడి బెయిల్ తెచ్చుకోగలిగారు. ఇప్పుడు ఆయన ఇక తన పోరాటం బిజెపిపైనే అని ప్రకటించారు. అయితే ఏ ప్రజల ఆకాంక్షలకోసం ప్రాంతీయ పార్టీలు ఏర్పడ్డాయో అవి ఆ ఆకాంక్షలను విస్మరించి అధికారాన్ని కొద్ది మంది వ్యక్తుల చేతుల్లో కేంద్రీకృతం అయ్యేలా చూశాయి. అరాచక పాలనతో పాటు, విపరీత అవినీతికి పాల్పడ్డాయి. రాష్ట్రీయ జనతాదళ్ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ అనుభవాన్ని అవి విస్మరించాయి. ఇవాళ ప్రజలు కాంగ్రెస్ వైపో, బీజేపీ వైపో మళ్లుతున్నారంటే అందుకు ప్రధాన కారణం ప్రాంతీయ పార్టీల నేతల స్వయం కృతాపరాధాలే అని చెప్పుకోవాల్సిందే. ఈ పరిస్థితిని అధిగమించి ప్రజారంజక పాలన సాగిస్తేనే ప్రాంతీయ పార్టీలకు మనుగడ ఉండలదు.

# సనాతన ధర్మ రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

## స్కందగిరి ఆలయంలో కోటి కుంకుమార్చన పూజలు - ఎంపీ ఈటల, ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి హాజరు





సికింద్రాబాద్ ఆగస్ట్ 12 (ప్రజామంటలు):

భారత దేశంలోని సనాతన ధర్మ పరిరక్షణ ప్రతి ఒక్కరి భాద్యత అని, విశ్వశాంతి సాధనలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డిలు అన్నారు. పద్మారావునగర్ స్కందగిరి శ్రీసుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో విశ్వశాంతి, సనాతన ధర్మం, హిందూ మత రక్షణకై కొనసాగుతున్న శ్రీ విద్యా కోటి కుంకుమార్చన మహాయాగ్న పూజలు సోమవారం రెండో రోజు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్, ఆర్మూర్ బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి, హైదరాబాద్ కంటెస్టెంట్ ఎంపీ మాధవీలత, మాజీ ఎమ్మెల్సీ ఎన్. రాంచంద్రారెడ్డి లు పాల్గొని, లలితా త్రిపురాసుందరి దేవి సన్నిదానంలో పూజలు చేశారు. మహిళలు వందల సంఖ్యలో కోటి కుంకుమార్చన పూజ ల్లో పాల్గొన్నారు. వారణాసికి చెందిన స్వామి అభిషేక్ బ్రహ్మచారి ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు. ఆలయ ఫౌండర్ ట్రస్టీ చైర్మన్ కృష్ణన్ రాజమణి, యువ చేతన నేషనల్ కో ఆర్డినేటర్ రోహిత్ కుమార్ సింగ్ , భక్తులు పాల్గొన్నారు.



# గ్రీవెన్స్ డే సందర్భంగా పలు ఫిర్యాదులను పరిశీలించిన ఎస్పీ అశోక్ కుమార్

## బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని అధికారులకు ఆదేశం

జగిత్యాల ఆగస్ట్ 12 (ప్రజామంటలు):

ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో బాగంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 11మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడడం జరుగుతోందని తెలిపారు.

# ఆన్లైన్ ట్రాంజక్షన్ తో జర జాగ్రత్త

## జమ్మికుంట టౌన్ సీఐ వరగంటి రవి



జమ్మికుంట ఆగస్ట్ 12 (ప్రజామంటలు): నాగంపేట గ్రామానికీ చెందిన పంజాల తిరుపతి తండ్రి వీరస్వామి గ్రామం నాగంపేట అను అతడు తన స్నేహితునికి ఫోన్ పే ద్వారా డబ్బులు పంపగ ట్రాంజక్షన్ కావటం లేదని గూగుల్ సర్చ్ లో ఆంధ్రాబ్యాంక్ కస్టమర్ కెర్ నంబర్ తెలుసుకొని ఫోన్ చేయగా వారు అడిగిన వివరాలు తెలిపినపట్టినుండి 1,40,999 రూపాయిలు కట్ అయినవని పిర్యాదు ఇవ్వగా కేసు నమోధు చేయనైనది.

# ఎస్సీ కాలనీలో వైకుంఠధాం ఏర్పాటు చేయాలి



గొల్లపల్లి ఆగస్ట్ 12 (ప్రజామంటలు):

గొల్లపల్లి మండల కేంద్రంలో ఎస్సీ కాలనీ వైకుంఠధామ నిర్మాణం చేయాలని స్థానిక తహసిల్దార్ కు గొల్లపల్లి మండల దళిత మోర్చా మండల అధ్యక్షులు చెవులమద్ది శేఖర్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు కట్ట మహేష్ మాట్లాడుతూ దళితులు మండల కేంద్రంలో జనాభాపరంగా అధిక సంఖ్యలో ఉన్నారు కానీ వారిలో చాలామంది భూమిలేని నిరుపేదలు కనీసం ఇంట్లో ఎవరైనా చనిపోతే పూడ్చడానికి కాల్చడానికి కూడా స్థలం లేక చాలామంది కాలని వాసులు ఇబ్బందులు పడుతున్నారు అంతేకాకుండా దళితులు అనే వివక్షతో ఇతరుల భూములలో దహన సంస్కరణలు చేయడానికి ఎవరు ఒప్పుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు ఇట్టి విషయమై అధికారుల వెంటనే స్పందించి చర్యలు తీసుకొని ప్రజలకు సౌకర్యం కోసం వైకుంఠధామం పనులు వెంటనే ప్రారంభించాలని కోరారు ఇట్టి కార్యక్రమంలో బిజెపి ఐటీ సెల్ కన్వీనర్ చెవులమద్ది రాజు, బీజేవైఎం టౌన్ ప్రెసిడెంట్ సంగం కళ్యాణ్ ఎస్టీ మోర్చా మండల అధ్యక్షుడు మానుపాటి రమేష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



# గ్రీవెన్స్ లో స్వీకరించిన దరఖాస్తులను తప్పనిసరిగా పరిష్కరించాలి

జనగామ ఆగస్ట్ 12 (ప్రజామంటలు):

గ్రీవెన్స్ లో స్వీకరించిన దరఖాస్తులను తప్పనిసరిగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్ తో కలిసి ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.... దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పలు సమస్యలపై (84) దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ తెలిపారు. పాలకుర్తి మండలం చెన్నూరు గ్రామానికి చెందిన కే. వెంకటేశ్వర్లు తన దరఖాస్తు అందిస్తూ పాలకుర్తి కోఆపరేటివ్ సొసైటీలో రుణం తీసుకున్నానని మాఫీ చేయించాలని విజ్ఞప్తి అందించారు. జాఫర్గడ్ మండలం తిమ్మంపేట గ్రామానికి చెందిన గర్వాంధుల అర్జున్ తన దరఖాస్తు అందిస్తూ నా పట్టా భూమి చెరువు నీటితో మునిగి పోవడం వలన వేరే భూమి కేటాయించాలన్నారు. ప్రజల నుంచి స్వీకరించిన పలు ఫిర్యాదుల పై తహసిల్దార్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షిస్తూ దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తూ దరఖాస్తుతో పాటు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలతో గ్రీవెన్స్ కు రావాలన్నారు. దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలని దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, ఆర్డీఓలు కొమురయ్య, వెంకన్న, వివిధ శాఖల సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పద్మారావునగర్ పార్కులో ఉచిత మెడికల్ క్యాంపు



సికింద్రాబాద్ ఆగస్ట్ 12 (ప్రజామంటలు):

బన్సీలాల్ పేట డివిజన్ పద్మారావునగర్ పార్కులో సోమవారం ఉచిత ఇఎన్టీ, దంత వైద్య శిభిరం నిర్వహించారు. ఈసందర్భంగా పార్కుకు వచ్చిన వాకర్స్, సందర్శకులకు ఉచితంగా వైద్య పరీక్షలుచేసి, మందులను అందచేశారు. ఉచిత వైద్య శిభిరాన్ని నిర్వహించిన డాక్టర్ జ్యోత్స్నశ్రీ అనిశెట్టి , డాక్టర్ సాయికుమార్, డా.సనా, డా.మణికంఠ లను అభినందించారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అద్యక్షులు మామిడి బాల్ రెడ్డి, వాకర్స్ అసోసియేషన్ సలహాదారు ఇ. చంద్రశేఖర్, గౌతమి, దీప, జ్యోతి, నజ్మ పాల్గొన్నారు.

# బమ్మెర పోతన గ్రంథాలయంలో గ్రంథాలయ దినోత్సవం

## గ్రంథాలయ పితామహుడు ఎస్.ఆర్. రంగనాథన్ జయంతి వేడుకలు



జనగామ ఆగస్ట్ 12 (ప్రజామంటలు):

జనగామ జిల్లా పాలకుర్తి మండలం బమ్మెర గ్రామంలోని పోతన గ్రామ గ్రంథాలయంలో గ్రంథాలయ దినోత్సవం, గ్రంథాలయ పితామహుడు ఎస్సార్ రంగనాథన్ జయంతి వేడుకలను పోతన సాహిత్య కళావేదిక, బమ్మెర పోతన గ్రంథాలయం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోతన సాహిత్య కళావేదిక అధ్యక్షుడు మాన్యపు బుజేందర్, గ్రంథ పాలకుడు దేవసాని ఉపేందర్ లు రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.... ఎందరో జీవితాల్లో వెలుగులు నింపిన పుస్తకబండాగారం గ్రంథాలయమని ఆ గ్రంథాలయాల కోసం ఎంతో పరితపించి గ్రంథాలయాలను నెలకొల్పిన మహానుభావుడు గొప్ప వ్యక్తి అని రంగనాథన్ ను వారు కొనియాడారు. గ్రంథాలయాలు దేవాలయాలని, విజ్ఞాన గనులని విద్యార్థిని విద్యార్థులు యువకులు గ్రంథాలయాలను సందర్శించి సద్వినియోగం చేసుకోవాలని బుజేందర్, ఉపేందర్ లు కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు లోకేష్, రుత్విక్, సందీప్, తరుణ్, నాగరాజు, రాజేష్, శ్రీధర్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

# మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తి కి 'సమాజ సేవ' శిక్ష విధించిన కోర్టు: ఎస్సై సురేష్

వేలేర్ ఆగస్ట్ 12 (ప్రజామంటలు):

వేలేరు మండల కేంద్రంలో ఫుల్ గా మద్యం సేవించి ద్విచక్ర వాహనం నడిపిన వ్యక్తి పోలీసులకు చిక్కడంతో ఒక రోజు 'సమాజ సేవ' చేయాల్సిందిగా కోర్టు తీర్పునిచ్చింది. వివరాల్లోకి వెళితే రాజవరం ప్రాంతానికి చెందిన బాబీ శుక్రవారం రోజున మద్యం సేవించి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా వేలేరు ఎస్.ఐ. సురేష్ కి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో వాహనదారుడు బాబీ ను పోలీసులు పరీక్షించగా వాహనదారుడు పెద్ద స్థాయిలో మద్యం సేవించినట్లుగా నిర్ధారణ కావడంతో సదరు మద్యం సేవించిన వాహనదారున్ని ఈరోజు రెండవ తరగతి కోర్టు న్యాయమూర్తి ఎదుట పోలీసులు హాజరు పర్చడంతో వాహన దారుడు సేవించిన మద్యం మోతాదును పరిశీలించిన న్యాయమూర్తి ఎక్కువ మొత్తం లో మద్యం సేవించి వాహనం నడపదాన్ని నేరంగా పరిగణిస్తూ సదరు వాహనదారుడు ఒక రోజు సమాజసేవ చేయాల్సింది తీర్పు ఇవ్వడంతో, తీర్పును అనుసరించి స్థానిక వేలేరు తాసిల్దార్ కొమీ మేడం ఎదుట హాజరు పరచడంతో సదరు నిందితుడు తాసిల్దార్ పరిసరాలను శుభ్రం చేయాల్సిందిగా తాసిల్దార్ ఉత్తర్వులు జారీ చేశారు. దీనితో మద్యం సేవించి వాహనం నడిపిన వాహనదారుడు ఈరోజు స్థానిక తహసిల్దార్ కార్యాలయంలోని పోలీసులు తాహసిల్దార్ పర్యవేక్షణలో పిచ్చి మొక్కలు, గడ్డిని తొలగించి శిక్షను పూర్తి చేసాడు.







# బంగ్లాదేశ్ లోని హిందువులకు మద్దతుగా నేడు జనగామ బందు వి హెచ్ పి

జనగామ ఆగస్ట్ 12 (ప్రజామంటలు):

బంగ్లాదేశ్ లో హిందువులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, హిందువులకు మద్దతుగా ఈనెల 13న జనగామ బంద్ ప్రకటన కోసం హిందూవాహిని, బజరంగ్దాల్, విశ్వహిందూ పరిషత్, పిలుపినిచ్చారు. బంగ్లాదేశ్ లోని హిందువులతో పాటు, భారత్ నుంచి ఉన్నత చదువుల కోసం బంగ్లాదేశ్ కి వెళ్ళిన హిందువులపై బంగ్లాదేశ్ లో జరుగుతున్న దాడులను, మహిళలపై చేస్తున్న అత్యాచారలని ఆరికట్టాలని హిందువులకు మద్దతుగా వి.హెచ్.పి, హిందూ సంఘాల ఆధ్వర్యంలో బంధు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.



# జమ్మికుంట లో రైల్వే కార్మికుల ఆందోళన

జమ్మికుంట ఆగస్ట్ 12 (ప్రజామంటలు):

ఆల్ ఇండియా రైల్వే ఫెడరేషన్, సౌత్ సెంట్రల్ మజ్దూర్ యూనియన్ పిలుపుమేరకు ఈరోజు జమ్మికుంట బ్రాంచ్ ఆధ్వర్యంలో జమ్మికుంట రైల్వే స్టేషన్ ముందు ఆందోళన చేపట్టారు వారి యొక్క ప్రధాన డిమాండ్ పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోవిడ్ కాలంలో ఇవ్వాల్సిన పద్దెనిమిది నెలల డిఏ బకాయిలు చెల్లించాలని వెంటనే ఎనిమిదవ వేతన సంఘం ఏర్పాటు చేయాలని మజ్దూర్ యూనియన్ కార్మికుల ఆందోళన చేపట్టారు. ఇందులో నాయకులు జమ్మికుంట బ్రాంచ్ చైర్మన్ వి. రాజయ్య, వైస్ చైర్మన్ జి, స్వప్న, బ్రాంచ్ యూత్ కన్వీనర్ పి. కుమార్ స్వామి లతోపాటు పలువురు కార్మికులు పాల్గొన్నారు.



# అల్లె సంగయ్య సదా స్మరణీయులు



కోరుట్ల ఆగస్ట్ 12 (ప్రజామంటలు):
జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో స్వర్గీయ అల్లె సంగయ్య సదా స్మరణీయులు అని వారి వ్యక్తిత్వంతో ఎంతోమందిని ప్రభావితం చేసిన గొప్ప వ్యక్తి అని సి.ప్రభాకర్ స్మారక గ్రంథాలయం కోశాధికారి అల్లె ఆనంద్, సత్య నారాయణ లు అన్నారు. పట్టణంలోని ఆదర్శ విద్యాసంస్థల అధినేత, తెలుగు పండితులు, కవి స్వర్గీయ అల్లె సంగయ్య నాల్గవ వర్ధంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యులు సోమవారం యాచకులకు అన్నదానం నిర్వహించారు. ఆహార పొట్లాలను కుటుంబ సభ్యుల చేతుల మీదుగా యాచకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ఒక మంచి విద్యావేత్తగా, వక్తగా, ఉపాధ్యాయునిగా ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దిన సంగయ్య విద్యారంగానికి చేసిన సేవలు మరవలేనివని వారు అన్నారు. తనదైన శైలిలో అద్భుతమైన ఉపన్యాసాలతో విద్యార్థులను చైతన్యవంతం చేసే వారని, తెలంగాణ ఉద్యమ సమయంలోనూ ఆయన పాత్ర, కృషి మరవలేనివని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు అల్లె సత్య నారాయణ, అల్లె సతీష్, రుద్ర వినోద్, బోగ నవీన్, నేమూరి సంజీవ్, గజం శంకర్, నామాల రాకేష్, రాచర్ల సుమన్, మచ్చ సాయి కృష్ణ, రాపెల్లి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి సమస్యలను అధిక ప్రాధాన్యతతో పరిష్కరించాలి

## ప్రజావాణి ఫిర్యాదులు: 91 - జిల్లా అదనపు కలెక్టర్ పి. రాంబాబు

జగిత్యాల ఆగస్ట్ 12 (ప్రజామంటలు):
ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే సమస్యలను అధిక ప్రాధాన్యతతో పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ పి. రాంబాబు, సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియం లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను, (లోకల్ బాడీస్) గౌతమ్ రెడ్డి తో కలసి స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు, కలెక్టర్ మాట్లాడుతూ. సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా ప్రజావాణి



కార్యక్రమానికి మొత్తం 91 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల, కోరుట్ల, ఆర్డిఒలు, మధుసూధన్, ఆనంద్ కుమార్, కలెక్టరేట్ ఏ.ఓ. హన్మంతరావు, డిపివొ రఘు వరుణ్, సిపిఓ, వివిధ జిల్లా అధికారులు, కలెక్టరేట్ పర్యవేక్షకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## స్కాలర్ షిప్ వెంటనే విడుదల చేయాలని

# కోరుట్లలో పోస్టు కార్డుల ఉద్యమం




కోరుట్ల ఆగస్ట్ 12 (ప్రజామంటలు):
జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో శ్రీ అరుణోదయ డిగ్రీ కళాశాలలో గత మూడు సంవత్సరాలుగా స్కాలర్ షిప్ లను విడుదల చేయని కారణంగా విద్యార్థులు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రికి స్కాలర్ షిప్ విడుదల చేయాలని పోస్ట్ కార్డు ద్వారా విన్నవించు కున్నారు. స్కాలర్ షిప్ ఇవ్వకపోవడం వల్ల విద్యార్థులకు పరీక్ష ఫీజులు కట్టుకోవడానికి మరియు పుస్తకాలు కొనుక్కోవడానికి బస్సు పాసుల కొరకు డబ్బులు లేక కళాశాలకు రెగ్యులర్గా రాలేక చాలా నష్టపోతున్నారు. దేశానికి రైతులే కాదు విద్యార్థులు కూడా ముఖ్యమే దీన్ని గుర్తుంచుకొని ముఖ్యమంత్రి త్వరగా స్కాలర్ షిప్ లు విడుదల చేయాలని కోరుతున్నారు. పేద బడుగు బలహీన మధ్యతరగతి కుటుంబానికి చెందిన విద్యార్థిని విద్యార్థులు మాత్రమే డిగ్రీ విద్యను అభ్యసిస్తున్నారు , నిర్లక్ష్యం చేస్తే చాలామంది విద్యార్థులు విద్యకు దూరం అయ్యే అవకాశం ఉంటుంది. యువతని కాపాడు కోవడం కోసం అయినా స్కాలర్ షిప్ త్వరగా ఇవ్వాలి. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపన్యాసక బృందం , నాన్ టీచింగ్ స్టాఫ్ మరియు డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థిని విద్యార్థులు అందరూ పాల్గొన్నారు.

## మెటుపల్లి మండలం వేంపేట గ్రామం సేవాభారతి ఆధ్వర్యంలో

# అథ్లెటిక్స్ గంగాధర్, హర్షవర్ధన్ లకు ఘన సన్మానం

కోరుట్ల ఆగస్ట్ 12 (ప్రజామంటలు):
ఇటీవల కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీ వారిచే గోల్డ్ మెడల్ పొందిన సందర్భంగా ఆల్ రౌండర్ గంగాధర్ కు మరియు అండర్ 12 రన్నింగ్ రేసులో రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపిన చిట్టాపూర్ గ్రామానికి చెందిన హర్షవర్ధన్ రాజు కు సేవా భారతి అధ్యక్షులు గాజంగి రాజ మల్లయ్య ఆధ్వర్యంలో ఘన సన్మానం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎంతోమంది విద్యార్థులను క్రీడాకారులుగా మార్చిన ఘనత గంగాధర్ కు దక్కుతుందని, పదవి విరమణ తర్వాత కూడా క్రీడాకారులలో ఉత్సాహాన్ని నింపుతూ ఉన్నతలో తీర్చిదిద్దడం వారి గొప్పదనం అన్నారు. చిన్న వయసులో మారు మూల గ్రామమైన చిట్టాపూర్ నుండి రాష్ట్ర స్థాయి క్రీడాకారునిగా ఎదగడం హర్షవర్ధన్ రాజు లాంటి క్రీడాకారులకు మాత్రమే చెందుతుందని,




ఇలాంటి పల్లెల్లో పుట్టిన పగడాలను మట్టిలోని మాణిక్యాలను గుర్తించి సన్మానించడం, క్రీడాకారులకు అందరికీ దక్కిన గౌరవమని అన్నారు. హర్షవర్ధన్ లాంటి క్రీడాకారున్ని ఆదర్శంగా తీసుకొని విద్యార్థులందరూ సెల్ ఫోన్ లో నిమగ్నం కాకుండా క్రీడా ప్రాంగణాల వైపు దృష్టి సారించి శారీరక సౌష్టవాన్ని పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అథ్లెటిక్స్ జిల్లా కార్యదర్శి ఏలేటి ముత్యంరెడ్డి, విష్ణువర్ధన్ రాజు, జయ కృష్ణ, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

# మగవారిపై దాడి చేస్తున్న కాకులు

## వైరల్ అవుతున్న వీడియో

రాజన్న సిరిసిల్ల ఆగస్ట్ 12 (ప్రజామంటలు):
సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మగవాళ్లపై కాకులు పగ బట్టాయి. కేవలం మగవాళ్ల తలపై కాళ్లతో తన్నుతూ కాకులు దాడి చేస్తున్నాయి. విచిత్రంగా ఉన్నా నమ్మితీ రాల్సిందే. ఇందుకు సంబంధించిన వీడియోసైతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ ఘటన సిరిసిల్ల జిల్లా కేంద్రం లో ఈరోజు ఉదయం చోటు చేసుకుంది. సిరిసిల్ల పాత బస్టాండ్ లో కట్ట మైసమ్మ గుడివద్ద తిరుగు తున్న మగవాళ్లపై కాకులు కాళ్లతో దాడి చేస్తున్నాయి. బస్టాండ్ నుంచి బయటకు వెళ్లే వారిపై, లోపలికి వచ్చే మగవాళ్లను మాత్రమే తలపై తన్నుతూ చెట్టు కొమ్మపైకి వెళ్లి వాలుతు న్నాయి. ఇందుకు సంబంధించిన వీడియోను చూసిన నెటిజన్లు ఆశ్చర్యపోతున్నారు. అక్కడి కాకులు మగవాళ్ల పైనే ఎందుకు దాడిచేస్తున్నా యంటూ ఆశ్చర్యపడుతున్నారు.






# జగిత్యాల జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించడం ప్రభుత్వ బాధ్యత

## ఐ.జె.యు. జాతీయ కౌన్సిల్ సభ్యులు జె. సురేంద్ర కుమార్

జగిత్యాల ఆగస్ట్ 12 (ప్రజామంటలు):
జిల్లా కేంద్రంలో జర్నలిస్టులు వారి హక్కుల సాధన కోసం చేస్తున్న నిరవధిక నిరసన దీక్ష పదవ రోజుకు చేరుకుంది. ఈ దీక్ష శిబిరానికి హాజరైన ఇండియన్ జర్నలిస్టు యూనియన్ జాతీయ కౌన్సిల్ సభ్యులు మాట్లాడుతూ జర్నలిస్టులు ఇళ్ల స్థలాల కోసం చేస్తున్న పోరాటం జర్నలిస్టుల హక్కు అని అన్నారు జర్నలిస్టులను తక్కువ చేసి చూస్తే సహించేది లేదన్నారు. గత ప్రభుత్వాలు కరీంనగర్ జిల్లా కేంద్రంలో మండల కేంద్రాలలో ఇళ్ల స్థలాలు సాధించుకున్నామని ఈ సందర్భంగా గుర్తు చేశారు జగిత్యాల లో పనిచేస్తున్న పాత్రికేయులకు స్థలం ఇప్పించడంలో నిమ్మకు నీరెత్తినట్టు ప్రజా ప్రతినిధులు వ్యవహరిస్తున్నారన్నారు.




# కరాటే పోటీల్లో యూరో నార్చర్ స్టూడెంట్స్ ప్రతిభ

## కాంస్య పథకాలు గెలుచుకున్న ఇద్దరు చిన్నారులు

సికింద్రాబాద్ ఆగస్ట్ 12 (ప్రజామంటలు):
హైదరాబాద్ లోని యూసుఫ్ గూడ లోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో జరిగిన 6వ జీఎస్కేడీఐ ఇంటర్నేషనల్ కరాటే ఛాంపియన్ షిప్%-%2024 కరాటే పోటీల్లో పద్మారావునగర్ కు చెందిన యూరో నార్చర్ స్కూల్ స్టూడెంట్స్ తమ ప్రతిభ చాటారు. కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో రెండు వేర్వేరు విభాగాల్లో పోటీ పడిన 4వ క్లాస్ చదువుతున్న స్టూడెంట్ అబిగేల్ బెర్నెసి, 2వ క్లాస్ చదువుతున్న స్టూడెంట్ ఏరిల్ బెట్రస్ లు ఇద్దరు కాంస్య పథకాలను గెలుపొందారు. పాఠశాల నుంచి భవిష్, అబిగేల్ బెర్నెసి, ఏరిల్ బెట్రస్ మొత్తం ముగ్గురు కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొనగా, ఇందులో ఇద్దరు పథకాలను గెలుపొందడం పట్ల పలువురు స్కూల్ యజమాన్యాన్ని అభినందించారు. విజేతలైన ఇద్దరు స్టూడెంట్స్ను , వారి పేరేంట్స్ను యూరో నార్చర్ స్కూల్ కరస్పాండెంట్ థామస్ ఉదయ్ కుమార్ అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.



## మోకాళ్ళ పై నిలబడి జర్నలిస్టుల నిరసన

జగిత్యాల ఆగస్ట్ 12 (ప్రజామంటలు):
జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సాధనకై జిల్లా కేంద్రంలోని ఆర్డీవో ఆఫీస్ ముందు 10 వ రోజు నిరసన దీక్ష కొనసాగుతున్నది. 10 రోజులైనా ప్రభుత్వం నుండి స్పష్టమైన హామీ రాకపోవడంతో దీక్షలో మోకాళ్ళ పై నిలబడి జర్నలిస్టులు నిరసన తెలిపినారు.

## జగిత్యాల పద్మశాలి సంఘ ఎన్నికలలో గెలుపొందిన నూతన కార్యవర్గాన్ని సన్మానించిన మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి -లక్ష్మణ్

జగిత్యాల ఆగస్ట్ 12 (ప్రజామంటలు):
జగిత్యాల పట్టణము పద్మశాలి సంఘ ఎన్నికలలో సంఘ అధ్యక్షులుగా బోగ గంగాధర్ (జీఆర్), ఉపాధ్యక్షులుగా బోగ రాజ్ కుమార్, జనరల్ సెక్రెటరి గా గాదాసు రాజేందర్, జాయింట్ సెక్రెటరి గా మానపురి మహేష్, కోశాధికారి గా కొక్కుల ప్రభాకర్, డైరెక్టర్లు మంచాల జమున, మ్యాన శబరి, కస్తూరి నరేష్, కొప్పు సందీప్, వేముల శంకర్, సంబరి కళావతి లను చైర్ పర్సన్ నివాసములో మర్యాద పూర్వకంగా కలవగా మున్సిపల్ చైర్ పర్సన్ ఆడువాల జ్యోతి లక్ష్మణ్ నూతన కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భముగా వారు మాట్లాడుతూ.... ఎన్నికలలో విజయం సాధించిన అందరికి అభినందనలు తెలుపుతూ, పద్మశాలి సంఘ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.









## సెంట్రల్ మినిస్టర్ ప్రహల్లాద్ జోషిని కలిసిన వనగొంది విజయలక్ష్మి

గుంతకల్లు ఆగస్ట్ 12 (ప్రజామంటలు):
భారతీయ జనతా పార్టీ ని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి నీ కలిసి ఆంధ్ర ప్రదేశ్ డిపార్ట్మెంట్ లో జరుగుతున్న అవక తవకాల గురించి, ఎఫ్ సి ఐ గోడన్ ల గురించి, రేషన్ స్టోర్ లో ఉండే సమస్యల గురించి, ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం లో జరుగుతున్న అవక తవకల గురించి, ప్రభుత్వ హాస్టల్స్ లో జరుగుతున్న భోజన వ్యవస్థ గురించి, అంగనవాడి కేంద్రాల్లో గర్భిణీ స్త్రీలకు మరియు శిశువులకు ఇస్తున్న పౌష్టిక ఆహారాల గురించి, రేషన్ షాపుల్లో ఉండే ఇబ్బందుల గురించి, అంత్యోదయ మరియు రేషన్ తెల్లకార్డు కలిగిన కుటుంబాల గురించిన విషయం పైన దానికి సంబంధించిన వివరించి కమిటీకి వీలైనంత తొందరగా చైర్మన్ ను ఏర్పాటు చేయాలని వారికి వినతి పత్రాన్ని అందజేసిన వనగొంది విజయలక్ష్మి బిజెపి మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మరియు మినిస్ట్రీ ఆఫ్ కన్స్యూమర్ ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఏపీ డైరెక్టర్ మరియు వనగుంది కిరణ్ దానికి కేంద్రమంత్రి స్పందించి స్పీకర్ తో ఈ విషయం పైన చర్చించి వీలైనంత తొందరగా చైర్మన్ ను ఏర్పాటు చేసి కమిటీని ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని వారు తెలియజేయడం జరిగింది.

## దుర్వ్యసనాలు కలిగిన విద్యార్థులు లక్ష్యాన్ని చేరుకోలేరు

### నోడల్ అధికారి కే. వెంకటేశ్వర్లు





జగిత్యాల ఆగస్ట్ 12 (ప్రజామంటలు):
దురలవాట్లతో లక్ష్యసిద్ధి అసాధ్యం దుర్వ్యసనాలు కలిగిన విద్యార్థులు తమ లక్ష్యాలను చేరుకోలేరని ఇంటర్ విద్య జిల్లా నోడల్ అధికారి కె. వెంకటేశ్వర్లు అన్నారు. హార్ట్ ఫుల్ నెస్ ఫౌండేషన్, రోటరీక్లబ్, రెడ్ క్రాస్ సొసైటీ ల ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో సోమవారం నిర్వహించిన నషాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు ముఖ్య అథితిగా పాల్గొన్నారు. మద్యం, మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే నష్టాలు, నివారణకు తీసుకోవలసిన చర్యలు వివరించారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల విద్యార్థులు ఏకాగ్రత కోల్పోతారని శారీరక, మానసిక అనారోగ్యాలకు గురవుతారని స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు వివరించారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులు మాదక ద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ నిర్వహించారు. జిల్లా నోడల్ అధికారిగా నియమితులైన తరువాత మొదటిసారి కళాశాలకు వచ్చిన వెంకటేశ్వర్ల ను అధ్యాపకులు సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆలియా మక్సూద్, హార్టీఫుల్ నెస్ ట్రైనర్ మంచాల కృష్ణ, రోటరీక్లబ్ , రెడ్ క్రాస్ సొసైటీ మెంబర్ సిరిసిల్ల శ్రీనివాస్, ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం కో ఆర్డినేటర్ కే. తిరుపతి రెడ్డి, అధ్యాపకురాలు రిజ్వానా పాల్గొన్నారు.

## ముందస్తు ఇండిపెండెన్స్ సెలబ్రేషన్ లో ఆకట్టుకున్న జమ్మికుంట విద్యార్థులు



జమ్మికుంట/ హైదరాబాదు ఆగస్ట్ 12 (ప్రజామంటలు):
78వ స్వతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని ఆదివారం ముందస్తుగా హైదరాబాదు రవీంద్ర భారతి లో భారత్ ఆర్ట్స్ అకాడమీ మేనేజింగ్ డైరెక్టర్ లలిత మేడం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు జమ్మికుంటకు చెందిన బాదేల స్వప్న లత కూచిపూడి నాట్య కళాబృందం ఆధ్వర్యంలోని విద్యార్థులు కూచిపూడి నాట్య ప్రదర్శన చేసి వీక్షకులను అలరించారు. ముఖ్యంగా జస్విక అనే రెండు సంవత్సరాల పాప కూచిపూడి నాట్యం చేసి చూపరులను ఆకట్టుకున్నది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కూచిపూడి విద్యార్థులు యశస్విని, రూపిని, వాసార, లౌక్య, సాత్విక, శాలిని, సహస్ర, సంహిత, మహాన్య, ధ్రువిష, సాయి దివ్య బృందం పాల్గొన్నారు.

## పెండింగ్ స్కాలర్షిప్ ల విడుదల చేయాలని జిల్లా కేంద్రంలో విద్యార్థుల ర్యాలీ



జగిత్యాల ఆగస్ట్ 12 (ప్రజామంటలు):
గత 3సంవత్సరాలుగా నిలిచిపోయిన తమ స్కాలర్షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, తమ చదువుకు ఆటంకం కల్పించవద్దని కోరుతూ జగిత్యాల జిల్లా కేంద్రంలోని పలు డిగ్రీ కళాశాల విద్యార్థులు కొత్త బస్టాండ్ చౌరస్తా నుండి తహసీల్ చౌరస్తా వరకు ర్యాలీగా బయలుదేరి తమ ఆవేదన వెలుబుచ్చారు. సీఎం రేవంత్ వెంటనే తమ యొక్క స్కాలర్షిప్ బకాయిలను విడుదల చేసి తమ ఉన్నత విద్యకు ఎలాంటి ఆటంకం లేకుండా దోహదపడాలని కోరారు.

## రాజీలేని పోరాటాలు చేయడంలో ముందుంటాం

### జిల్లా కార్యదర్శి అక్రమ్ మాలిక్



జగిత్యాల ఆగస్టు 12 (ప్రజామంటలు):
ఏ.ఐ.ఎస్.ఎఫ్ 89వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జగిత్యాల సమితి కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి జెండాను ఆవిష్కరించిన జిల్లా ఏఐఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అక్రమ్ మాలిక్ అనంతరం 89వ ఆవిర్భావ కేక్ ను కట్ చేసిన ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ దేశ స్వాతంత్రం రాకపూర్వమే దేశంలో మొట్టమొదటి విద్యార్థి సంఘం గా లక్నో మహానగరంలో భగత్ సింగ్, రాజ్ గురు, సుకుదేవ్, ఆజాదుల ఇంకా ఎందరో వీరుల ఆశయ సాధన కోసం బబ్రుద్దీన్ బాస్, ప్రేమ్ నారాయణ భార్గవ్ నాయకత్వాన 1936 ఆగస్టు 12న ఏ.ఐ.ఎస్.ఎఫ్ ఆవిర్భవించింది బ్రిటిష్ సామ్రాజ్యవాదుల బానిస చేర నుంచి మాతృభూమి విముక్తి కై సాగిన విరోచిత స్వాతంత్ర ఉద్యమంలో పొత్తిళ్లలోనే పిడికిలి బిగించి స్వాతంత్రం మా జన్మ హక్కు అని మా అంతం చూసినా స్వాతంత్రోద్యమ పంతం వీడమంటూ నినదించి భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్రం కావాలని భరతమాత బానిస సంకెళ్ళ నుంచి విముక్తి కావాలని ఎందరో విద్యార్థులు విప్లవ కిశోరుల బలిదానం చేసిన ఘనమైన చరిత్ర కలిగిన దేశంలోనే ఏకైక మొనగాడి సంఘం ఏ.ఐ.ఎస్.ఎఫ్ విద్యార్థి సంఘం అని ఈ సంఘం ద్వారా పోరాటాలు త్యాగాలే ధ్యేయంగా స్వాతంత్రానంతరం విద్యార్థి విద్యా పరిరక్షణకై శాస్త్రీయ విద్యా. కామన్ విద్యా విధానం అమలుపై నిరంతరం పోరాటాలు సాగిస్తూ 88 సంవత్సరాలుగా విద్యార్థుల శ్రేయస్సు కోసం అశేష త్యాగాలు చేస్తూ ఆవిర్భావం నాటి నుంచి నేటి వరకు గల్లి నుండి ఢిల్లీ వరకు విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమాలే ఊపిరిగా పోరాటాలు ప్రాణంగా విద్యారంగ సమస్యల పరిష్కారే ధ్యేయంగా చదువుతూ పోరాడు చదువుకై పోరాడు నినదించి తెలంగాణ రైతాంగ పోరాటంలో విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని విరోచిత పోరాటాలు 18 సంవత్సరాలకే ఓటు హక్కు ఉద్యమం మలిదశ తెలంగాణ పోరాటంలో హాస్టల్లో సమస్యలపై విద్యా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న పాలకుల సమస్యలపై పోరాటాలు చేసి దేశంలో ఎన్నో విజయాలను సాధించింది ఏ.ఐ.ఎస్.ఎఫ్. అని భవిష్యత్తులో జగిత్యాల జిల్లాలో ఉన్నటువంటి గవర్నమెంట్ హాస్టల్స్. సాంఘిక సంక్షేమ హాస్టల్స్. గాని అలాగే గవర్నమెంట్ స్కూల్స్. గవర్నమెంట్ కాలేజీల్లోడిగ్రీ కళాశాలల్లో గాని మౌలిక వసతులతో పాటు బోధనా సిబ్బందిని నియమించకపోతే ప్రై వేటు పాఠశాలల్లో కళాశాలలో ఫీజుల నియంత్రణ ప్రభుత్వం విస్మరిస్తే ఖచ్చితంగా భవిష్యత్తు ఉద్యమాల రూపకల్పన చేసి రాజీలేని పోరాటాలకు మరింత సిద్ధంగా ఉంటాం అని అన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జగిత్యాల పట్టణ అధ్యక్షులు వెన్న మహేష్, ఏఐఎస్ఎఫ్ కౌన్సిల్ సభ్యులు పట్టణ, మండల నాయకులు అధ్యక్ష కార్యదర్శిలు రాకేష్ దిల్షాన్, ఘని, షోయబ్, వేణు, అమిత్, రాజ్ కుమార్ సోహైల్ అష్వక్ సంజీవ్, గౌతమ్ వహీద్ ఫజల్ ఖాన్ సృజన్ ప్రశాంత్ మనీష్ కళాశాల పాల్గొన్నారు.




## కొడిమ్యాల మేరు సేవా సంఘ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం

కొడిమ్యాల ఆగస్ట్ 12 (ప్రజామంటలు):
కొడిమ్యాల మేరు సేవా సంఘం వారి నూతన కార్యవర్గ ఎన్నిక మరియు ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమం గౌరవ అధ్యక్షులు దీకొండ పెద్ద గంగాధర్ మేరు మరియు సంఘ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. అధ్యక్షుడు : దీకొండ గంగాధర్ మేరు, ఉపాధ్యక్షులు: రాపర్తి నర్సింగరావు మేరు, ప్రధాన కార్యదర్శి: దీకొండ స్వామి మేరు, కోశాధికారి : దీకొండ శ్రీనివాస్ మేరు, సహాయ కోశాధికారి: రాపర్తి నవీన్ మేరు లను మేరు సంఘ సభ్యుల అందరి సమక్షం లో ఏకగ్రీవంగా ఎన్నుకొని ప్రమాణ స్వీకారం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమం విస్డమ్ హై స్కూల్, అంగడి బజార్ నందు నిర్వహించడమైనది. ఇట్టి కార్యక్రమంలో మేరు సంఘ సభ్యులందరూ పాల్గొనడం జరిగింది.


## ఎమ్మెల్యే ను కలిసిన మాజీ పాక్స్ చైర్మన్

హనుమకొండ ఆగస్ట్ 12 (ప్రజామంటలు):
హనుమకొండ సుబేదారి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నందు మాజీ పాక్స్ చైర్మన్ బుద్దే పెద్దన్న జన్మదిన సందర్భంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ను మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. అనంతరం ఎమ్మెల్యే బుద్దే పెద్దన్న గారి జన్మదినం సందర్భంగా శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో 3వ డివిజన్ కార్పొరేటర్ జన్ను శీభరాణి – అనిల్ కుమార్, మండల అధ్యక్షుడు జన్ను సుధాకర్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు గాదె రాము, సోషల్ మీడియా మండల అధ్యక్షుడు కొకర్రకొండ అఖిల్, నాయకులు బిజిలి సంపత్, అనిల్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.



## రూ. 15 వేల ఆర్థిక సాయం చేసిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి

వేలేర్ ఆగస్ట్ 12 (ప్రజామంటలు):
మండల కేంద్రంలోని 9వ వార్డుకు చెందిన ఎండీ సుల్తాన భర్త: లేట్ ఎండీ సలీం వెల్డింగ్ కుటుంబానికి కుట్టు మిషన్ కోసం ఎమ్మెల్యే కడియం శ్రీహరి రూ. 15,000 ఆర్థిక సహాయం వారి నివాసంలో మాజీ సర్పంచ్ మల్లికార్జున్ ఆధ్వర్యంలో అందజేయటం జరిగింది. అదే విదంగా మాజీ సర్పంచ్ విజయపురి మల్లికార్జున్ 5,000 రూపాయలు ఎండి సలీం కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎండీ యూసుఫ్, ఎండీ రషీద్ పాల్గొన్నారు.



# సర్దార్ సర్వాయిపాపన్న సేవ పురస్కారం నాలో మరింత బాధ్యతను పెంచింది

## జక్కే వీరస్వామి గౌడ్



జమ్మికుంట ఆగస్ట్ 12 (ప్రజామంటలు): జై గౌడసేన జాతీయ సంఘము ఆధ్వర్యంలో హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మోర్ల ఏడుకొండలుగౌడ్ అధ్యక్షతన వివిధ రంగాల్లో సేవలు అందించిన గౌడ అనిముత్యాలకు సేవ పురస్కార అవార్డులు అందజేశారు ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్య అతిధులు గా సర్వాయిపాపన్న మోకుదెబ్బ గౌడసంఘము రాష్ట వ్యవస్థాపక అద్యక్షులు జక్కే వీరస్వామిగౌడ్ హాజరై మాట్లాడుతూ..... సర్వాయిపాపన్న వారసులుగా రొండు తెలుగు రాష్టాల్లో గౌడులను ఐక్యం చేసి రాజ్యాధికారమే లక్ష్యంగా కలిసి పనిచేయాలన్నారు ఆంధ్రప్రదేశ్ రాష్టంలో 10 శాతం లిక్కర్ షాపుల్లో గౌడ్స్ కు రిజర్వేషన్ ఇస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచన చేయటం శుభపరిణామని కానీ గీత వృత్తిదారుల సొసైటీలకు ఇస్తే ఇంకా బాగుంటుందని దీనిపై పునరాలోచన చేయాలని వీరస్వామిగౌడ్ అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న 374 వ జయంతి లోపల జనగామ జిల్లాకు పాపన్న పేరు ప్రకటించాలని డిమాండ్ చేశారు. త్వరగా హుసేన్ సాగర్ ట్యాంక్ బండ్ పై సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహం నెలకొల్పాలన్నారు. సర్వాయిపాపన్న అందించిన స్పూర్తితో గౌడులను ఏకం చేసి బహుజనులను చైతన్యం చేస్తు రాజ్యాధికారమే అంతిమ లక్ష్యంగా పోయిన అసెంబ్లీ ఎన్నికల్లో హుజురాబాద్ నియోజకవర్గలో ఎంఎల్ఏ గా పోటీ చేసి సర్వాయిపాపన్న వారసునిగా బహుజన జాతులకు మార్గదర్శిగా నిలిచినందుకు జై గౌడసేన జాతీయ సంఘము వ్యవస్థాపకులు మోర్ల ఏడుకొండలు గౌడ్ వారి సంఘము రొండు తెలుగు రాష్టాల నాయకులచేతుల మీదుగా సేవ పురస్కారం అందుకున్నందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సేవ పురస్కారం రావటం చాలా ఆనందంగా ఉందని ఇదే స్పూర్తితో పలు సమస్యలు ప్రభుత్వాల దృష్టికి తీసుకు వచ్చి మరింత సేవకార్యక్రమాలు అందిస్తానని వీరస్వామిగౌడ్ అన్నారు. హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కే%శీ%ద్రంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా సర్దార్ సర్వాయిపాపన్న సినీ హీరో పంజాల జైహింద్ గౌడ్ రిటైర్డ్ డిఎస్పీ అశోక్ కుమార్ గౌడ్, గౌడ హాస్టల్ అద్యక్షులు మోతె చక్రవర్తి గౌడ్, వివిధ గౌడ సంఘాల నాయకులు అంబాల నారాయణ గౌడ్, నక్కా కృష్ణాగౌడ్, నోముల సిద్దు గౌడ్, సినీ దర్శకుడు ముక్కెర వినయ్ బాబు గౌడ్, జిబిఎన్ చైర్మన్ చీకటి ప్రభాకర్ గౌడ్, పంజాల శ్రవణ్ గౌడ్, కలర్ సత్తన్న గౌడ్, కప్పల రవిగౌడ్, కూరేళ్ల వేములయ్య గౌడ్, నంగెడ్డ రంగారావు గౌడ్, మట్ట వీరబాబు గౌడ్, మోర్ల కామేశ్ గౌడ్, తాళ్లపెల్లి హరికుమార్ గౌడ్, యామ మురళి గౌడ్, పడాల నిరంజన్ గౌడ్ తెలుగు రాష్టాల గౌడ సోదరులు పాల్గొన్నారు.

## జగిత్యాల జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని ముఖమంత్రికి 35 వార్డు కౌన్సిలర్ హనుమండ్ల జయశ్రీ లేఖ



జగిత్యాల ఆగస్ట్ 12 (ప్రజామంటలు): జగిత్యాల పట్టణంలోని ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు. గత పది రోజుల నుండి "నిరసన దీక్ష" చేయడం జరుగుతుంది. గత 30 సం. ల నుండి ఇంటి స్థలాల కొరకు ప్రతి ఎమ్మెల్యే కు తెలియచేస్తూ వినతి పత్రాలు ఇస్తూ పోరాటం చేస్తూ వస్తున్నారు. కాని, ఏ ప్రభుత్వం వీరికి ఇంటి స్థలాలు మంజూరి చేయడం లేదు. పాత్రికేయ సోదరులకు ఇంటి స్థలాలు ఇవ్వడం ప్రభుత్వం ఒక్క బాధ్యత. ఎందుకంటే, ప్రభుత్వంకు, ప్రజలకు మధ్య ఒక వారధి గా ఉంటూ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్ళడంలో పాత్రికేయులే ప్రముఖ పాత్ర పోషిస్తారు మరియు తెలంగాణ రాష్ట్ర సాధన లో వీరి పాత్ర చాలా కీలకమైనది రాజ్యాంగంలో పోర్త్ ఫిల్లర్ గా మీడియా ఉంది. రాజ్యాంగానికి ఫోర్ పిల్లర్స్ కూడా ముఖ్యమైనవే. ఇందులో ఒక్కటి పనిచేయక పోయినా రాజ్యాంగం నిలబడలేదు కావున వీళ్ళ ప్రాధాన్యతను గుర్తించి ప్రభుత్వం కచ్చితంగా ఇంటి స్థలాలు మంజూరు చేయాలని 35 వ వార్డు కౌన్సిలర్ హనుమండ్ల జయశ్రీ ముఖ్యమంత్రి కు రాసిన లేఖలో కోరారు. జగిత్యాల పట్టణ పరిదిలో చాలా ప్రభుత్వ స్థలాలు ఉన్నాయి. ఎస్.అర్.ఎస్.పి. కి సంబందించిన 4 1/2 ఎకరాల స్థలం ఒక దగ్గర ఉన్నట్లుగా పాత్రికేయ సోదరులు మా దృష్టికి తీసుకొచ్చారు. కావున ఆ స్థలాన్ని అయిన మంజూరి చేయగలరని మనవి. జగిత్యాల జిల్లా కలెక్టర్ ని మరియు స్థానిక ఎమ్మెల్య , ఎమ్మెల్సి ల ద్వారా కూడా వివరాలను తెలుసుకొని వెనువెంటనే ఇక్కడ పది రోజులుగా నిరహార దీక్ష చేస్తున్న పాత్రికేయ సోదరులు దీక్ష విరమించే విధంగా వెంటనే ఇంటి స్థలాలు మంజూరి చేయాలని మా జగిత్యాల పట్టణ ప్రజలందరి పక్షాన 35 వ వార్డు కౌన్సిలర్ హనుమండ్ల జయశ్రీ కోరారు.

## జనగామలో బీజేవైఎం ఆధ్వర్యంలో ఘనంగా తిరంగ ర్యాలీ




జనగామ ఆగస్ట్ 12 (ప్రజామంటలు): జనగామ పట్టణ కేంద్రంలో బీజేవైఎం జనగామ జిల్లా అధ్యక్షుడు జంగా రాజవేంకట నర్సింహా రెడ్డి ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగ కార్యక్రమ పిలుపులో భాగంగా రైల్వేస్టేషన్ నుండి ఆర్టీసీ చౌరస్తా వరకు ఘనంగా తిరంగ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా బీజేపీ జనగామ జిల్లా అధ్య క్షులు ఆరుట్ల దశమంత్ రెడ్డి హాజరయ్యారు. ర్యాలీలో పార్టీ నాయకులు, విద్యార్థిని విద్యార్థులు, యువతి యువకులు జాతీయ జెండా చేతబట్టి దారి పొడుగునా భారత్ మాత కీ జై నినాదాలతో ఉత్సహంగా పాల్గొన్నారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ.... భారత దేశ జాతి ఐక్యత, సమగ్రత పట్ల నిబద్దతతో గత కొన్ని సంవత్సరాలుగా దేశ ప్రజలు, యువత, విద్యార్థులతో పాటు పార్టీ కార్యకర్తలు దేశవ్యాప్తంగా వివిధ రకాల కార్యక్రమాల ద్వారా హర్ ఘర్ తిరంగ – తిరంగ ర్యాలీలను ఉత్సహంగా జరుపుకుంటున్నారని తెలుపుతూ ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై ఆత్మ గౌరవంతో తీవర్ణ పతకాన్ని ఎగరావేయాలని అన్నారు, దేశంలోని ప్రతి ఒక్క పౌరుడు ఆగష్టు 15న స్వాతంత్ర దినోత్సవాన్ని పల్లె నుండి పట్నం వరకు సంబురాలతో నిర్వహించుకోవాలని తెలిపారు అదేవిదంగా ఇంటిపై జాతీయ పతాకం ఎగరావేసిన తరువాత సెల్ఫీ తీసుకొని సామాజిక మధ్యామాలల్లో పంచుకోవాలని అదేవిదంగా స్వాతంత్ర్యం కోసం పోరాడి వీర మరణం పొంది భారత మాత ఒడిలో నిద్దురపోతున్న అమరవీరుల విగ్రహాలను పరిసరాలను శుభ్రపరిచి, పుష్పగుచ్చలు ఉంచి పుష్పాంజలి ఘటించడంతో, యువత సెమినార్ కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు,ఈ కార్యక్రమంలో నాయకులు శివరాజ్ యాదవ్, కొంతం శ్రీనివాస్, హరిచంద్ర గుప్తా, లేగ రామ్మోహన్, కీర్తి వెంకటేష్, పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ అవయవదానం చేయాలి డాక్టర్ స్వర్ణలత



**జనగామ ఆగస్ట్ 12 (ప్రజామంటలు):** హార్ట్ టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అగస్టు 13న ప్రపంచ అవయవదానం దినోత్సవం సందర్భంగా రూపొందించిన పోస్టర్ ను జీవన్దాన్ ఇంచార్జ్ డాక్టర్ స్వర్ణలత తన కార్యాల యంలో ఆవిష్కరించినట్లు ట్రస్ట్ అధ్యక్షులు మూడే రవి నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ స్వర్ణలత మాట్లాడుతూ.... ప్రతి ఒక్కరూ అవయవదానం చేయాలని దేశంలో చాలా మంది శరీర అవయవాలు చెడిపోయి చాలా మంది చనిపోతున్నారని జీవన్దాన్ లో బాధితుల అవయవాలు కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్న సమయానికి అవయవాలు దొరకగా చాలా మంది చనిపోతున్నారని, తాను మట్టిలో కలిసిన తన అవయవాలతో మరో ఒకరికి పునర్జన్మ ఇవ్వడమే అవయవదానమని పేర్కొన్నారు. మనిషి బ్రెయిన్ డెడ్ అయిన తరువాత శరీరంలో అవయవాలు సేకరించి మరో 8 మంది కొత్త జీవితాన్ని ప్రసాదించవచ్చని కుటుంబ సభ్యులు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. ప్రతి ఒక్కరూ అవయవదానం పై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ ట్రస్టీ మూడే లక్ష్మి దేవి, శ్రీలతలు పాల్గొన్నారు.



## అంగరంగ వైభవంగా కొనసాగుతున్న శ్రావణమాసం అభిషేకములు

జగిత్యాల ఆగస్ట్ 12( ప్రజామంటలు):

జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణ వీధి హరిహరాలయంలో అఖిల బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రావణ మాస అభిషేక ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. భక్తుల విశేష సంఖ్యలో పాల్గొని స్వహస్తాలతో స్వామివారికి పంచామృత అభిషేకాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించి మూలమూర్తులను వివిధ పుష్పాలతో అలంకరించి మంగళహారతి, మంత్రపుష్పము, భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాద వితరణతోపాటు మహదాశీర్వచనము నిర్వహించారు. స్వామివారి నామస్మరణతో ఆలయం అంతా మారుమోగింది. వైదిక క్రతువులు అన్యారంభట్ల మృత్యుంజయ శర్మ, కంకటి సుధాకర్ శర్మ సిరిసిల్ల. కేదార్ శర్మ, మోతే. శివరామకృష్ణులు నిర్వహించారు.

## రెండు రోజులపాటు వానలు అప్రమత్తం చేసిన వాతావరణ శాఖ



హైదరాబాద్, (ప్రజా మంటలు): తెలంగాణలో 2 రోజుల పాటు వానలు పడతాయని సూచించింది. నిర్మల్, భూపాలపల్లి, ములుగు, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, కొత్తగూడెంలో వర్షాలు పడతాయని పేర్కొంది. ఇక భాగ్యనగరం హైదరాబాద్‌లో తేలికపాటి వర్షాలు పడతాయని వాతావరణ శాఖ అప్రమత్తం చేసింది. సికింద్రాబాద్‌లో కూడా వర్షాలు పడతాయని పేర్కొంది.నగరంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. రోడ్లన్నీ జలమయం అయ్యాయి. వర్షంలో ముందుకు కదలలేక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరోవైపు ఆకాశం మేఘావృతమై ఉంది. భారీ వర్షం కురుస్తుందని ఐఎండీతెలిపింది. ఆదివారం రాత్రి పలుప్రాంతాల్లో రికార్డు స్థాయి వర్షం పడింది. ఉస్మానియా యూనివర్శిటీ ప్రాంతంలో సుమారు 90 మిల్లీమీటర్ల రికార్డు స్థాయి వర్షపాతం నమోదైంది. ఎన్‌సీహెచ్ కాలనీలో 87.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అడిక్‌మెంట్‌లో 80.8 మిల్లీమీటర్లు.. బౌద్ధనగర్‌లో 80.9. మి.మీ. బారీ వర్షం కురిసింది. ద్రోణి ప్రభావంతో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మోస్తరు, భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇప్పటికే నాలుగైదు జిల్లాలకు అధికారులు అరెంజ్ అలెర్టు జారీ చేశారు. ముఖ్యంగా జీహెచ్‌ఎంసీకి సంబంధించి సోమవారం సాయంత్రం, రానున్న రెండు రోజులు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. నిన్న అర్ధరాత్రి నుంచి సోమవారం ఉదయం 7 గంటల వరకు హైదరాబాద్ నగర ప్రాంతాలు షేక్‌పేట, టోలీ చౌక్, ఉత్తరపల్లి, రాజేంద్ర నగర్, లంగర్ హౌస్, ఉస్మానియా, తార్నాక ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. అలాగే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మణికొండ, హైటెక్‌సిటీ, అమీర్‌పేట్, పంజాగుట్ట, ఫిలింనగర్, భరత్‌నగర్, బోరబండ, దిల్‌సుఖ్‌నగర్, మలక్‌పేట్, కోఠి ప్రాంతంలో కుండపోత వాన పడింది. ఉప్పల్, ఎల్‌బీనగర్, ఎస్‌ఆర్ నగర్‌లోనూ వర్షం దంచికొట్టింది. భారీ వర్షంతో పలు ప్రాంతాల్లో రోడ్లు జలమయం అయ్యాయి. ఈ క్రమంలో పలుచోట్ల వాహనదారులు తమ వాహనాలను రోడ్డు పక్కన నిలిపివేశారు.

# సాంప్రదాయ రీతిలో శ్రావణ సోమవారం వేడుకలు

## భక్తి శ్రద్ధలతో పూజలలో పాల్గొన్న భక్తులు

**(రామ కిష్టయ్య సంగన భట్ల)**

ధర్మపురి ఆగస్ట్ 12 (ప్రజామంటలు): సనాతన సాంప్రదాయాలకు నిలయమై, పలు దేవాలయాల సముదాయంతో విరాజిల్లుతున్న ధర్మపురిలో శ్రావణ మాస ద్వితీయ సోమవార వేడుకలు సాంప్రదాయ రీతిలో ఘనంగా జరిగాయి. హిందువులకు పరమ పవిత్రంగా భావించబడే శ్రావణంలో క్షేత్రంలో నెలరోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు జరుగ నుండగా, సోమవారం పవిత్ర దినంగా భావించ బడుతుంది.

**"పరమ పవిత్రం... శ్రావణ సోమవారం".**

శ్రావణమాసం హిందువులకు పరమ పవిత్ర మైనది కాగా, శ్రావణ సోమవారం విశిష్టమైనది. లోకేశ్వరుడు అభయంకరుడైన కని శ్రావణ మాసం అందునా ప్రత్యేకించి, సోమవారం మహన్యాస పూర్వక రుద్రాభిషేకంతో పూజిస్తే శివసా యుజ్యం పొందగలని పురాణాలు విశదీకరిస్తున్నాయి. న్యాసము అనగా ఐక్యము చేసుకోవడం. పూజకు పూర్వం రుద్రుడిని, లింగంలో నిలుపుకుని, తాను రుద్రుడై, ఆ రుద్రుడిని అభిషేకించాలి. అందులకై మహన్యాస పూర్వక రుద్రాభిషేకంతో, కనీసం శ్రావణ సోమ వారమైన శివుని పూజించి, నిరాహారం, ఉప వాసం లేక ఏకభుక్తం చేయాలి. ద్వాదశ మాసాల్లో శ్రావణం, అందునా సోమవారం అత్యంత శ్రేష్ఠమైన దినం. ఈ నేపథ్యంలో శ్రావణ తొలి సోమవారం క్షేత్రం భక్తజనంతో కిటకిటలాడింది. శివకేశవులు నిలయమైన ధర్మపురి క్షేత్రానికి పర్వదిన సందర్భంగా సుదూర ప్రాంతాలనుండి, ఉదయా త్పూర్వం నుండే ఏతెంచిన భక్తులతో పాటు, స్థానిక సాంప్రదాయాచరణ పరులు భారీ వర్షాలను లెక్క చేయక, గోదావరిలో మంగళ స్నానాలు ఆచరించి, వివిధ దేవాలయాలలో దైవ దర్శనాలు చేసుకున్నారు. శ్రావణ సోమవారం సందర్భంగా, క్షేత్రంలోని శ్రీరామ లింగేశ్వర, అక్కపెల్లి రాజేశ్వర ఆలయాలలో, మార్కండేయ మందిరంలో, వాడవాడలలో గల శివ పంచాయతనాల యందు మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, సకృతావర్తన రుద్రాభిషే ప్రత్యేక పూజలు, సహస్ర నామ పారాయణాది కార్యక్రమాలను సాంప్రదాయ వేదోక్తరీతిలో కన్నుల పండువగా, భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. శ్రీయోగానంద, ఉగ్ర లక్ష్మీ నారసింహ, శ్రీవేంకటేశ్వర, ఆంజనేయ, యమ ధర్మరాజు, వేణుగోపాల, శ్రీరామ, దత్తాత్రేయ, శ్రీసాయి బాలాజీ, గౌతమేశ్వర ఆలయాలలో అర్చకులు ప్రత్యేక అర్చనలు గావించారు. దేవస్థాన అంతర్గత శ్రీరామలింగేశ్వర ఆల యంలో, దేవస్థానం ఈఓ శ్రీనివాస్, సూపరిం టెండెంట్ కిరణ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో, సిబ్బంది పర్యవేక్షణలో, వేద పండితులు బొజ్జా రమేశ్ శర్మ, ముత్యాల శర్మ, పాలెపు ప్రవీణ్ శర్మ, ఆలయాల అర్చకులు దేవళ్ళ విశ్వనాథ శర్మ, శ్రావణ శాశ్వత నిధి ప్రత్యేక పూజాదులు నిర్వహించారు. శ్రీ అక్కపెల్లి రాజేశ్వ రాలయంలో అర్భకులు బూస ప్రవీణ్, జన మంచి శ్రీనివాస్, వేదవిదులు రుద్రాభిషేకాలు, శాశ్వతనిధి పూజలు జరిపారు.





V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL01938. FILE NO.1349985 PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com